మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

20.04.2025 ఆదివారం Sunday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 02 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


## లక్నో అద్భుత విజయం

అవేశ్‌ఖాన్ అద్భుత ప్రదర్శన

రాజస్థాన్‌పై ఉత్కంఠ విజయం 07





# ప్రపంచంతో పోటీ

## ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి

- ఢిల్లీ పరిస్థితులు చూసి గుణపాఠం తెచ్చుకోవాలి
- మూసీరివర్ ఫ్రంట్ అభివృద్ధికి కొందరు అడ్డు
- రాష్ట్రంలో త్వరలోనే డ్రై పోర్ట్ ఏర్పాటు
- జపాన్ తెలుగు సమాఖ్య సదస్సులో సీఎం రేవంత్

**అనేక రంగాల్లో తెలంగాణ అభివృద్ధి సాధించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని అన్నారు. తెలం గాణలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ప్రపంచం తో పోటీ పడేలా తెలంగాణను అందరం కలిసి అభివృద్ధి చేసుకో వాలని పిలుపు నిచ్చారు. టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్ ఫ్రంట్ పరిశీలించామని కూడా సీఎం రేవంత్ తెలిపారు.**

**జనతా న్యూస్ హైదరాబాద్ :** అభివృద్ధిలో ప్రపంచంతోనే తెలంగాణ పోటీ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్.. శనివారం జపాన్ తెలుగు సమాఖ్య కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిలో జపాన్‌లోని తెలుగు వారు భాగం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో ప్రగతి సాధించామని.. రాష్ట్రంలో త్వరలోనే డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. టోక్యోలో రివర్ ఫ్రంట్‌ను పరిశీలించామన్నారు. మూసీనది ప్రక్షాళనకు కొందరు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఢిల్లీ పరిస్థితి చూసి మనం గుణపాఠం నేర్చుకోవాలన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిలో అందరి సహకారం అవసరమని.. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో

మిగతా 2 లో

## జపాన్‌లో యువతకు ఉద్యోగ అవకాశాలు

02




## మరోమారు హైడ్రా దూకుడు

- ఏపీ ఎమ్మెల్యే ఫామ్‌హౌజ్ కూల్చివేత
- మియాపూర్‌లోనూ ఆక్రమణల తొలగింపు




02

హైడ్రా మరోమారు దూకుడు పెంచింది.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ఆక్రమణలకు పాల్పడింది ఎవరన్నది చూడకుండా కూల్చివేతలే టార్గెట్ గా వెళ్తున్న హైడ్రా ఇప్పుడు ఏపీ టీడీపీ ఎమ్మెల్యేకు భారీ షాక్ ఇచ్చింది. ఏపీలోని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కు చెందిన ఫామ్ హౌస్ ను కూల్చేశారు హైడ్రా అధికారులు. శనివారం కొండాపూర్ లోని సర్వే నంబర్ 79లో ఉన్న ఎమ్మెల్యే ఫామ్ హౌస్ ను కూల్చేశారు హైడ్రా అధికారులు.

## ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి

- కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ సూచన



03

## రెండ్రోజులు వర్షాలు

ఉరుములు, మెరుపులతో పడే ఛాన్స్

02

## చర్యలు నాపైనేనా!

- చట్టం అందరికీ సమానమా?
- 2 వేల మంది షేర్ చేశారు
- మరోమారు స్మితా సబర్వాల్ పోస్ట్

02



## అలా అయితే.. పార్లమెంట్ మూసేయాల్సిందే

- చట్టాల చేసే సభల ప్రమేయం లేకుండా చేస్తే ఎలా
- సుప్రీం తీరుపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె

రాష్ట్రపతికి గడువు విధిం చేలా న్యాయవ్యవస్థ వ్యవ హరించడం తగదని ఉప రాష్ట్రపతి వ్యాఖ్యలపై ఇప్ప టికే వివాదం రేపగా, తాజా గా అత్యున్నత న్యాయ స్థానంపై బీజేపీ ఎంపీ సం చలన వ్యాఖ్యలు చేశారు.



## అబ్బాయిలకు పీరియడ్స్ వస్తే.. తెలుస్తుంది

- మా బాధేంటో వారికి అర్థం కావాలంటే అదేమందు
- నటి జాన్వీకపూర్ ఆసక్తికర కామెంట్స్

2 లో..



## మంత్రులకు తప్పిన ప్రమాదం




**జనతా న్యూస్ నాగర్‌కర్నూల్ :** మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపి మల్లు రవిలకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో మంత్రులు, ఎంపి భూభారతి సదస్సులో పాల్గొనేందుకు వచ్చారు. ఆ సమయంలో వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండింగ్ అవుతున్న సమయంలో హెలిప్యాడ్ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది. హెలికాప్టర్ ల్యాండ్ కోసం ఇచ్చిన సిగ్నల్ బుల్లెట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

## నాన్న లేకున్నా.. అమ్మ కష్టపడి చదివిస్తోంది



02

- అమ్మకోసం ఇకనుంచి మంచిగా చదువుకుంటా
- కన్నీళ్లు పెట్టించిన చిన్నారి సాత్విక ప్రసంగం
- భావోద్వేగానికి గురైన హరీష్ రావు



# ప్రపంచంతో తెలంగాణ పోటీ

మొదటి పేజీ తరువాయి

సాధించాల్సినంత ప్రగతి సాధించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకం. తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. రాష్ట్ర అభివృద్ధిలో అందరి సహకారం అవసరం. మీ తోడ్పాటు-తో ప్రపంచంతోనే మనం పోటీ పడొచ్చు. ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం మీకు తెలుసని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# చర్యలు అందరిపైనా..తనపైనేనా



**హైదరాబాద్, ఏప్రిల్ 19:** తెలంగాణ రాష్ట్రంలో కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ విషయంలో ప్రభుత్వం తీరును ప్రతిపక్ష పార్టీలు సహా పలువురు ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు ఎండగడుతున్నారు. ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ కు తెలంగాణ పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. పోలీసులు పంపిన నోటీసులపై స్మితా సబర్వాల్ తాజాగా స్పందించారు. గచ్చిబౌలి పోలీసులకు తాను పూర్తిగా సహకరించినట్లు- చెప్పారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్లు- తెలిపారు. ఆ పోస్టును తాను రీపోస్టు చేసినట్లే 2 వేల మంది షేర్ చేసినట్లు పేర్కొన్నారు. వాళ్లందరిపైనా ఇలాంటి చర్య తీసుకుంటారా..? చట్టం అందరికీ సమానమా.. ? ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. దీనిపై స్పష్టత కోరినట్లు- స్మితా సబర్వాల్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి మార్చి 31న 'హాయ్ హైదరాబాద్' అనే ట్విట్టర్ హ్యాండిల్ నుంచి పోస్ట్ చేసిన గిబ్లి తరహాలో ఉన్న ఇమేజ్‌ని స్మితా సబర్వాల్ రీటీ-÷-వట్ చేశారు. సేవ్ హైదరాబాద్, సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ- అని పేర్కొన్నారు. ఆ పోస్టులో మష్రూమ్ రాక్ ఎదుట భారీ సంఖ్యలో బుల్డోజర్లు మోహరించగా, బుల్డోజర్లకు ఎదురుగా నెమలి, జింకలు ఉన్నాయి. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఇది ఫేక్ ఫొటో అంటూ అభియోగాలు మోపారు. ఈ మేరకు బీఎన్ఎస్ 179 సెక్షన్ కింద స్మితా సబర్వాల్‌కు పోలీసులు నోటీసులు పంపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురికి నోటీసులు జారీ చేసిన పోలీసులు విచారణకు పిలుస్తున్నారు.

# తెలంగాణలో రెండ్రోజులు వర్షాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 19 :** తెలంగాణలో రానున్న రెండు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శనివారం హెచ్చరించింది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో మధ్యాహ్నం 2 గంటల తర్వాత వాతావరణంలో అకస్మాత్తుగా మార్పులు చోటు- చేసుకోనున్నట్లు- తెలిపింది. ఈ నేపథ్యంలో ఈదురుగాలులు, వడగండ్ల వానలు కూడా కురిసే అవకాశముందని పేర్కొంది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. ఇక హైదరాబాద్ నగరంలో, నిన్నటితో పోలిస్తే నేడు వర్ష తీవ్రత కొంత తక్కువగానే ఉంటుందని 'తెలంగాణ వెదర్ మ్యాన్' అంచనా వేశారు. అయితే నగర పరిధిలోని ఘట్‌కేసర్, కీసర, దమ్మాయిగూడ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశముందని తెలిపారు. కాప్రా, సైనిక్‌పురి, నాచారం, మల్లాపూర్, ఈసీఐఎల్, చెర్లపల్లి, నారపల్లి, బోడుప్పల్, నేరేడ్‌మెట్, యాప్రాల్ వంటి ప్రాంతాల్లో వచ్చే రెండు గంటల్లో వర్ష ప్రభావం కనిపించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# కాలేజీ భవనంపై దూకి విద్యార్థి ఆత్మహత్య

**సూర్యాపేట, ఏప్రిల్ 19 :** కాలేజ్ భవనంపై నుంచి దూకి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదం సంఘటన సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకుంది. చిలుకూరు మండలం గేట్ ఇంజినీరింగ్ కాలేజ్ లో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలానికి చెందిన కృష్ణవేణి అనే విధ్యార్థిని బీటెక్ చదువుతోంది. శనివారం తెలవారుజామున కాలేజ్ భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. అయితే, ఆత్మహత్య చేసుకునే ముందు..హాస్టల్ గదిలో తల్లితో కృష్ణవేణి ఉన్నట్లు తెలుస్తోంది. కాలేజ్ యాజమాన్య వేధింపులే ఆత్మహత్యకు కారణమా? లేక కుటుంబ కలహాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గాజాపై బాంబుదాడి.. 70మంది మృతి

**గాజా, ఏప్రిల్ 19:** ఇజ్రాయిల్ సైన్యం గాజాపై మరోసారి బాంబుదాడికి పాల్పడింది. శుక్రవారం ఇజ్రాయిల్ సైన్యం గాజాలోని ఓల్డ్ సిటీ తుఫాతో సహా పలు ప్రదేశాల్లో ఇళ్లపైనా, సహాయక శిబిరాలపైనా బాంబు దాడికి పాల్పడింది. ఈ దాడి వల్ల 70 మందికిపైగా పాలస్తీనియన్లు మృతి చెందినట్లు వైద్య వర్గాలు మీడియాకు వెల్లడించాయి. ఇజ్రాయిల్ పాల్పడుతున్న వరుస దాడులవల్ల పాలస్తీనా ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. తక్షణమే గాజా ప్రజలకు ఆహారం అవసరం అని.. తక్షణమే వారికి ఆహారాన్ని అందించాలని ఐక్యరాజ్యసమితి యొక్క ఆహార కార్యక్రమం అత్యవసర హెచ్చరికను జారీ చేసింది. కాగా, ఇజ్రాయిల్ బాంబు దాడుల వల్ల పాలస్తీనా ప్రజలు మానసికంగా ఎంతో కుంగిపోయారు. ఇజ్రాయిల్ దిగ్బంధనం వల్ల ప్రజలు వారి పిల్లలకు కనీసం ఆహారం కూడా పెట్టు-కోలేని దీనావస్థలో ఉన్నారని గాజాలోని మీడియా ప్రతిధి తెలిపారు.

# జపాన్‌లో యువతకు ఉద్యోగ అవకాశాలు

## - రేవంత్ బృందం కీలక ఒప్పందం!



హైదరాబాద్, ఏప్రిల్19: తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. కార్మిక ఉపాధి శిక్షణ శాఖ అధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) జపాన్‌లోని రెండు ప్రముఖ సంస్థలతో శనివారం ఒప్పందాలు కుదు-ర్చుకుంది. దీంతో రాబోయే ఒకటి నుండి రెండు సంవత్సరాలలో సుమారు 500 ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయి. హెల్త్ కేర్, నర్సింగ్ రంగంలో 200 ఉద్యోగాలు, ఇంజనీరింగ్ రంగంలో (ఆటోమోటివ్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) 100 ఉద్యోగాలు, హాస్పిటాలిటీ రంగంలో 100 ఉద్యోగాలు, నిర్మాణ రంగంలో (సివిల్ ఇంజనీరింగ్, భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సామాగ్రి నిర్వహణ) 100 ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. యువతకు నైపుణ్యాల శిక్షణతో పాటు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలకు ఈ ఒప్పందాలు అద్దం పట్టాయి. జపాన్ పర్యటనలో బిజిబిజీగా ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి. అక్కడి తెలుగు కమ్యూనిటీని కలుకున్నారు. తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళికలు వివరించారు. ఎన్ఆర్ఐలు రాష్ట్ర అభివృద్ధిలో భాగం అయ్యేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. సొంత ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఎన్ఆర్ఐలు తోడ్పాటు అందిస్తే.. ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. సొంత ప్రాంత అభివృద్ధిలో భాగం కావాలని పిలుపునిచ్చారు సీఎం రేవంత్. టెర్న్ (టీజీయూకే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్), రాజ్ గ్రూప్ తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు చేసుకుంది. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం ఆ రెండు సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది. తెలంగాణలో నైపుణ్యమున్న నిపుణులను జపాన్‌లోని అధిక డిమాండ్ ఉన్న రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. టెర్న్ గ్రూప్ టోక్యోలో ప్రాంతీయ కార్యాలయంతో పాటు సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్, స్కిల్డ్ వర్కర్ రంగాలలో అంతర్జాతీయ నియామకాలు చేపడుతుంది.రాజ్ గ్రూప్ జపాన్‌లో పేరొందిన నర్సింగ్ కేర్ సంస్థ త్సుకుయి కార్పొరేషన్ లిమిటెడ్ భాగస్వామ్యంతో గతంలో టామ్ కామ్ తో కలిసి పని చేసింది. కొత్త ఒప్పందంతో హెల్త్ కేర్ రంగంలో పాటు ఇతర రంగాల్లోనే సహకారం విస్తరించనుంది.

# నాన్న లేకున్నా.. అమ్మ కష్టపడి చదివిస్తోంది



**సిద్దిపేట,ఏప్రిల్19 :** ముక్కుపచ్చలారని ఓ చిన్నారి కథ విని మాజీ మంత్రి హరీశ్‌రావు భావోద్వేగానికి లోనయ్యారు. తండ్రి చనిపోయినా కష్టపడి చదువుతున్న ఆ చిన్నారి కథ విని కన్నీళ్లు పెట్టుకున్నారు. సిద్దిపేటలో స్కూల్ విద్యార్థులకు 'భద్రంగా ఉండాలి.. భవిష్యత్‌లో ఎదగాలి' అనే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ చిన్నారి మాట్లాడుతూ.. నా పేరు సాత్విక.. నేను ఇక్కడికి రావడానికి మా అమ్మే కారణం.. నేను సెకండ్ క్లాస్‌లో ఉన్నప్పుడు మా నాన్న చనిపోయాడు. అప్పటినుంచి మా అమ్మే నన్ను మంచిగా చూసుకుంటుంది. కానీ నేనే ఊరికే తిడుతుండేదాన్ని. నేను ఇప్పటినుంచి మా మమ్మీని మంచిగా చూసుకుంటాను. మా మమ్మీకి మంచి పేరు తీసుకువస్తాను. ధన్యవాదాలు అని ఆ చిన్నారి వలవలా ఏడ్చేసింది. ఇక ఆ చిన్నారి చెప్పిన మాటలకు.. హరీశ్‌రావు కూడా కన్నీరు పెట్టుకున్నారు. సాత్వికను దగ్గరకు చేరదీసి ఏడ్వొద్దని చెప్పారు. తన పక్కన కూర్చోబెట్టుకుని ఆ పాపను ఓదార్చారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. అమ్మనాన్నల గౌరవాన్ని తమకు అర్థమయ్యేట్టు- చెప్పి, వాళ్ల విలువ తెలిసేటట్టు- చెప్పి, మనందరికి కళ్లు తెరిపించినటువంటి పిల్లలను చప్పట్లతో అభినందించాలి. ఈ పిల్లల బాధలు విని ప్రతి ఒక్కరూ రియలైజ్ కావాలి. తల్లిదండ్రుల విలువ ఏంటో అర్థమైందని అనుకుంటున్నా.. ఐ లవ్ మై పేరెంట్స్, ఐ లవ్ మై టీచర్స్ అని ప్రామిస్ చేయండి.. జీవితాంతం తల్లిదండ్రులు, టీచర్లను ప్రేమించాలి. అమ్మ కంటే మంచి కోరుకునే వారు ఈ భూమ్మీద ఎవరూ ఉండరు. ఫోన్లు చూస్తూ టైమ్ వేస్ట్ చేయొద్దు. అమ్మ మాట వినండి.. గౌరవించండి.. ఇవాళ్టి నుంచి మీ అందరిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నా అని హరీశ్‌రావు పేర్కొన్నారు.




# సమతుల ఆహారం..వ్యాయామం

## ఇవే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష.. వరల్డ్ లివర్ డే కార్యక్రమంలో అమిత్ షా

**హైదరాబాద్, ఏప్రిల్ 19:** సమతుల ఆహారంతో పాటు, తగిన వ్యాయామంతోనే ఆరోగ్యంగా ఉండగలమిన కేంద్రహోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. దేశ యువత ఆరోగ్యంపై దృష్టిసారించాలని సూచించారు. దానివల్ల మరో 40-50 ఏళ్లు జీవించి, దేశ వృద్ధికి దోహదం చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. వరల్డ్ లివర్ డే సందర్భంగా దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...తన వెయిట్ లాస్ జర్నీని వెల్లడించారు. తాను పాటిస్తోన్న జీవనశైలిని మంత్రి వెల్లడించారు. తగిన నిద్రపోవాలి. నీరు, శరీరానికి సరిపడే పౌష్టికాహారం తీసుకోవాలి. ఇక రోజూ చేసే వ్యాయామం నాకెంతో ఉపయోగపడింది. అందుకే నేను ఇప్పుడు మీ ముందు ఇలా నిల్చున్నాను. నేను ఎలాంటి అల్లోపతి మందులు, ఇన్సులిన్ తీసుకోవడం లేదు. 2020 నుంచి కొనసాగుతోన్న ఈ తరహా వెయిట్ లాస్ జర్నీలో.. నిద్ర, వ్యాయామం అత్యంత కీలకం. వాటిని అంతా సీరియస్‌గా తీసుకోవాలి. శరీరం కోసం రెండు గంటల వ్యాయామం, మెదడు ఆరోగ్యం కోసం ఆరు గంటల నిద్ర ఉండాలి. ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. నా అనుభవం నుంచి ఇదంతా చెప్తున్నానని మంత్రి వెల్లడించారు. ఇదివరకు ప్రధాని మోదీ కూడా ఇలాంటి సూచనలే చేసిన సంగతి తెలిసిందే. తమ అదనపు బరువును తగ్గించుకోవాలని ప్రజలకు మోదీ సూచించారు. అనేక వ్యాధులకు ఊబకాయమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా, వంటనూనెల వినియోగాన్ని 10 శాతం తగ్గించడం ద్వారా శరీరంలోని అధిక కొవ్వును కరిగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మన జీవనశైలితో ముడిపడిన వ్యాధులతో మన ఆరోగ్యానికి భారీ ముప్పు పొంచిఉంది. ఊబకాయం వాటిల్లో ఒకటి. ఇది అనేక వ్యాధులకు మూలకారణంగా నిలుస్తోంది. 2050 నాటికి దేశంలో ఊబకాయుల సంఖ్య 44 కోట్లకు చేరుతుందని ఓ నివేదిక పేర్కొంది. ఈ సంఖ్య చాలా పెద్దది..భయపెట్టేది. నివేదికలోని అంశం వాస్తవరూపం దాలిస్తే..ప్రతిముగ్గురిలో ఒకరు ఊబకాయంతో బాధపడతారు. ఈ పరిస్థితి తలెత్తకుండా ప్రజలు తమ ప్రయత్నాన్ని ప్రారంభించాలి. అదేవిధంగా వంటనూనెల వాడకాన్ని 10 శాతం తగ్గించాలని గతంలోనే సూచించా. వంటనూనెల కొనుగోలును 10 శాతం తగ్గిస్తామంటూ ప్రతిఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలి. క్రమం తప్పకుండా చేసే వ్యాయామం, సైక్లింగ్‌తో ఊబకాయం దూరమవుతుంది' అని మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# మరోమారు హైడ్రా దూకుడు




**హైదరాబాద్,ఏప్రిల్19 :** హైడ్రా మరోమారు దూకుడు పెంచింది.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ఆక్రమణలకు పాల్పడింది ఎవరన్నది చూడకుండా కూల్చివేతలే టార్గెట్ గా వెళ్తున్న హైడ్రా ఇప్పుడు ఏపీ టీడీపీ ఎమ్మెల్యేకు భారీ షాక్ ఇచ్చింది. ఏపీలోని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కు చెందిన ఫామ్ హౌస్ ను కూల్చేశారు హైడ్రా అధికారులు. శనివారం కొండాపూర్ లోని సర్వే నంబర్ 79లో ఉన్న ఎమ్మెల్యే ఫామ్ హౌస్ ను కూల్చేశారు హైడ్రా అధికారులు.ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఫామ్ హౌస్ తో పాటు ఆఫీస్ నిర్మించినట్లు అధికారులు తెలిపారు. సుప్రీం కోర్టులో కేసు పెండింగ్ లో ఉండగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ నిర్మాణాలు చేపట్టారని..సర్వే నెంబర్ 79 లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు అధికారులు. ఇకపోతే అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మియాపూర్ వరల్డ్ వన్ స్కూల్ వెనుక ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేస్తోంది. షెడ్లను జెసిబిల సహాయంతో కూల్చివేసింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగాయి. గతంలో సంబంధిత వ్యాపారులకు నోటీసులు ఇచ్చిన స్పందించకపోవడంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే తుర్కయంజాల్ మున్సిపాలిటీ లోని సర్వే నెంబర్ 213, 214 ,215 ,216 లో స్కూప్స్ ఐస్ క్రీమ్ కంపెనీ రోడ్డుకు అడ్డంగా నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. దీంతో శ్రీరంగపురం కాలనీ, సుందరయ్య కాలనీ, లక్ష్మీ నగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ లతో పాటు-సుమారు 7, 8 కాలనీ స్థానికులు హైడ్రా అధికారుల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. రహదారి కబ్జా చేసి చుట్టూ కొంతమంది వ్యక్తులు ప్రహరీ గోడ నిర్మించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డామని వాపోయారు. అక్రమ కట్టడాలపై ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకున్న నాధుడే లేడని.. కానీ, ముత్యాలమ్మ అనే మహిళ ఒంటరి పోరాటం చేస్తూ హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదుతో హైడ్రాధికారులు స్పందించి అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేయడం సంతోషంగా ఉందన్నారు. సమస్యను పరిష్కరించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి బాధిత కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అబ్బాయిలకు పీరియడ్స్ వస్తే.. తెలుస్తుంది

## నటి జాన్వీకపూర్ ఆసక్తికర కామెంట్స్



**ముంబై, ఏప్రిల్ 19 :** అందాల భామ జాన్వీకపూర్ సినిమాల్లో దూసుకుపోతోంది. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాల్లో హీరోయిన్ గా చేస్తూ వరుస హిట్లు అందుకుంటోంది. ఆమె సినిమాల్లో స్టార్ గా ఉంటూనే.. చాలా విషయాలపై కౌంటర్లు వేస్తూనే ఉంటుంది. ఎప్పటికప్పుడు సొసైటీలో జరిగే విషయాలపై స్పందిస్తుంది. తాజాగా పీరియడ్స్ పెయిన్ పై మాట్లాడింది. 'అమ్మాయిల పీరియడ్స్ బాధను చాలా మంది అర్థం చేసుకోరు. అదేదో చిన్న విషయం అన్నట్టే మాట్లాడుతారు. నాకు పీరియడ్స్ టైమ్ లో మూడ్ సింగ్స్ వేరేలా ఉంటాయి. అందుకే నేను మాట్లాడే విధానాన్ని బట్టి చాలా మంది ఇది నీకు ఆ సమయమా అని అడుగుతారు అంటూ తెలిపింది.అమ్మాయిల పీరియడ్స్ పెయిన్ చాలా బాధగా ఉంటుంది. దాన్ని కొందరు చులకనగా చూస్తారు. ఒకవేళ అబ్బాయిలకు పీరియడ్స్ వస్తే ఆ బాధను తట్టుకోలేరు. అప్పుడు మా బాధ ఏంటి అనేది వారికి అర్థం అవుతుంది. అబ్బాయిలకు పీరియడ్స్ వస్తే కచ్చితంగా అణు యుద్ధాలే జరిగేవి' అంటూ జాన్వీ షాకింగ్ కామెంట్స్ చేసింది. ఆమె చేసిన కామెంట్లు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. గతంలో కూడా అబ్బాయిలపై ఇలాంటి కామెంట్లే చేసింది జాన్వీ.. హీరోయిన్ అంటే కేవలం సినిమాలే చేస్తే సరిపోదని.. సొసైటీ-లో జరిగే విషయాలపై స్పందించాలి అంటూ చెప్తోంది జాన్వీకపూర్. ప్రస్తుతం రామ్ చరణ్ తో చేస్తున్న పెద్ది సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది.

# సినిమాలపై నెగెటివ్ కామెంట్స్ సరికాదు

- ఇష్టం లేకపోతే సినిమా చూడకండి
- దీనితో ఎందరో జీవితాల ముడిపడి
- సన్నాఫ్ వైజయంతి సక్సెస్ మీట్‌లో విజయశాంతి



**హైదరాబాద్, ఏప్రిల్ 19 :** సినిమాలకు నెగటివ్ పబ్లిసిటీ చేసేవారికి నటి విజయశాంతి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సినిమాలు బాగలేకపోతే ఫెయిల్ కావడం కామన్. కానీ కొందరు దుష్ట శక్తులు కావాలని పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కొందరు సినిమాను ఖూనీ చేస్తూ పైశాచిక ఆనంద పొందుతున్నారని మండిపడ్డారు. బాగున్న సినిమాను బాగలేదని..బాగలేని సినిమాను బాగుందని ప్రచారం చేయడం కరెక్ట్ కాదని సూచించారు. అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా సక్సెస్ మీట్ లో మాట్లాడిన విజయశాంతి.. థియేటర్ లో సినిమాను చూసిన ప్రేక్షకులు బాగుందంటున్నారు కానీ కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. సినిమాను చంపే హక్కు లేదని..సినిమాల వెనుక చాలా మంది జీవితాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటితరం ఎన్నో ఆశలు పెట్టుకుని సినిమాల్లోకి వస్తున్నారని అన్నారు. సినిమా నచ్చకుంటే చూడొద్దన్నారు. ఎవరైతే మిమ్మల్ని గెలుకుతారో మీ మైండ్ వాష్ చేస్తారో అలాంటి వాళ్లు.. వాళ్ల దగ్గరకు వెళ్లి చెంచాగిరి చేసుకోవాలని వ్యాఖ్యలు చేశారు. సినిమాను నాశనం చేద్దామనుకునే వాళ్లను అసలు క్షమించొద్దని మండిపడ్డారు. అందరి సినిమాలు ఆడాలని కోరుకున్నారు. విజయశాంతి కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన అర్జున్ సన్నాఫ్ వైజయంతి మూవీలో కీలక పాత్ర పోషించారు.ప్రదీప్ చిలుకూరి డైరెక్షన్ చేసిన ఈ సినిమా ఏప్రిల్ 18న థియేటర్లలో రిలీజ్ అయ్యింది.



# గుజరాత్‌లో బీజేపీని ఓడించి తీరుతాం

**కొత్త నాయకత్వాన్ని తీసుకుని వస్తాం**

**మా వ్యూహాలు మాకున్నాయి: రాహుల్**

**అహ్మదాబాద్, ఏప్రిల్19 :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, బీజేపీని ఓడించగలిగే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని, గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ నైతికస్థైర్యం కోల్పోయినట్టు కనిపిస్తున్న ప్పటికీ రాష్ట్రంలో బీజేపీని ఓడిస్తామని పార్టీ సీనియర్ నేత,లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. గుజరాత్‌కు చెందిన ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ...ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీని ఒక్క కాంగ్రెస్ మాత్రమే ఓడించగలదనే విషయం ప్రజలకు తెలుసునన్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత మార్పులు చేపట్టాల్సిన అవసరాన్ని తాము గుర్తించామని చెప్పారు. దీనిపై జిల్లాలకు చెందిన సీనియర్ నేతలను తాను కలుసుకున్నానని, చక్కటి చర్చలు జరిగాయని తెలిపారు. పార్టీలోని అంతర్గత సవాళ్లను పరిష్కరించేందుకు రాష్ట్రంలో కొత్త నాయకత్వాన్ని పరిచయం చేస్తామని చెప్పారు. ఇటీవల రాహుల్ గాంధీ మోడాసాలో జరిగిన కాంగ్రెస్ జిల్లా కార్యకర్తల సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఇదే విషయం స్పష్టం చేశారు. పార్టీ వ్యూహాలను వివరిస్తూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గుజరాత్‌లో పార్టీని పునర్వవస్థీకరించేందుకు తీసుకుంటున్న చర్యలను రాహుల్ ప్రస్తావిస్తూ, దీనిపై చాలా నెలలుగా పార్టీ సీనియర్ నేతలు, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయం పోరాటం కాదని, సైద్ధాంతిక పోరాటమని అన్నారు. నాయకుల మధ్య పోటీ వినాశకరమని, నిర్మాణత్మకం కాదని నేతలు తనకు చెప్పారని అన్నారు. పార్టీలో నాయకత్వ సవాళ్లను గురించి మాట్లాడుతూ, గుర్రాలలో రెండు రకాలు ఉంటాయని, ఒకటి రేసులకు ఉద్దేశించినవని, రెండో రకం పెళ్లిళ్లకు ఉద్దేశించినవని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కొన్నిసార్లు వెడ్డింగ్ హార్స్‌లను రేసులకు, రేసింగ్ హార్స్‌లను పెళ్లిళ్లకు పంపుతున్నట్టు నాయకులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. సరైన నేతలకు సరైన బాధ్యతలు అప్పగించాల్సిన అవసరం ఉందని రాహుల్ అన్నారు.

# బ్రాహ్మణులను విమర్శించడం ఫ్యాషన్ అయ్యింది

**దర్శకుడు కాశ్యప్ తీరుపై సర్వత్రా విమర్శలు**

**ముంబయి, ఏప్రిల్ 19:** అయిన దానికి కాని దానికి బ్రాహ్మణులను కించపర్చడం ఈ రోజుల్లో వేలం వెర్రి అయిందని పలువురు ప్రముఖులు స్పందించారు. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత , నటుడు అనురాగ్ కాశ్యప్ తమ ఫూలే సినిమా విడుదల నేపథ్యంలో బ్రాహ్మణులను కించపరుస్తూ మాట్లాడటం తీవ్ర నిరసనకు దారితీసింది.ఇంతకు ముందు గ్యాంగ్స్ ఆఫ్ వాసెయ్‌పూర్ వంటి సినిమాలకు దర్శకులు అయిన కాశ్యప్ ఇటీవల తమ ఫూలే సినిమాకు సెన్సార్ బోర్డు అభ్యంతరాల పట్ల మండిపడ్డారు. సెన్సార్ బోర్డు బ్రాహ్మణుల ఆధిపత్యంలో ఉందని, తాను బ్రాహ్మణులపై మూత్ర విసర్జన చేస్తానని దర్శకుడు తిట్టడం వివాదాస్పదం అయింది.ఈ వ్యాఖ్యలపై సర్వత్రా నిరసనలు వెలువడుతున్నాయి. బ్రాహ్మణులు పితృసమానులని. వారికి ఆగ్రహం తెప్పిస్తే ఎవరైనా మసికావల్సిందే అని సామాజిక మాధ్యమాల్లో స్పందనలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో కాశ్యప్ క్షమాపణ చెప్పాడు. అయితే ఇది కూడా వ్యంగ్యంగా వెటకారంగా ఉంది. తన కూతురు, కుటు-ంబ సభ్యులకు పరుష పదజాలపు బెదిరింపులు వస్తున్నాయని, ఇది బ్రాహ్మణ పైత్యం అని వ్యాఖ్యానించారు. కాగా శివసేన యుబిటి ఎంపి ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ బ్రాహ్మణులంటే చులకన భావం తగదని చెప్పారు, అంతా ఈ విధంగా తలతిక్కకు దిగడం ఫ్యాషన్ అయిందని విమర్శించారు. బ్రాహ్మణులను ఏది పడితే అది అనడం పరిపాటి అయిందని కేంద్ర మంత్రి సతీష్ చంద్రదూబే వ్యాఖ్యానించారు. బ్రాహ్మణులు తమ అధికార పరిధిలో చరిత్రను వక్రీకరించినట్లు- తనకు తెలిసిందని, తనకు సామాజిక న్యాయం , సమానత పై నమ్మకం ఉందని అయితే దీని అర్థం బ్రాహ్మణులను ఏది పడితే అది అనడం కాదని పలువురు స్పందించారు.

# అలా అయితే.. పార్లమెంట్ మూసేయాల్సిందే

**చట్టాల చేసే సభల ప్రమేయం లేకుండా చేస్తే ఎలా**

**సుప్రీం తీరుపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె వ్యాఖ్య**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:** రాష్ట్రపతికి గడువు విధించేలా న్యాయవ్యవస్థ వ్యవహరించడం తగదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే వివాదం రేపగా, తాజాగా అత్యున్నత న్యాయస్థానంపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబై సంచలన వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తన అభిప్రాయం వెల్లడించారు. అత్యున్నత న్యాయస్థానమే చట్టాలు చేస్తే పార్లమెంటు భవనాన్ని మూసివేయాల్సిందేనని అన్నారు. సుప్రీం కోర్టు అన్ని పరిమితులు దాటి వ్యవహరిస్తోంది. ప్రతి ఒక్కరూ ప్రతి విషయానికి సుప్రీంకోర్టుకు వెళ్తే ఇక పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు మూసేసుకోవాలని అన్నారు. హోమోసెక్సువాలిటీ పెద్ద నేరమని 377 అధికరణలో ఉంది. ట్రంప్ ప్రభుత్వం కూడా ప్రపంచంలో ఆడ, మగ మత్రమే ఉన్నట్టు చెప్పింది. హిందువులు, ముస్లిం, బౌద్ధులు, జైనులు, సిక్కులు ఎవరైనా సరే హోమోసెక్స్యువాలిటీని నేరమనే నమ్ముతాయి. అకస్మాత్తుగా ఒకరోజు సుప్రీంకోర్టు ఈ కేసును రద్దు చేసింది. పార్లమెంటుకు మాత్రమే చట్టాలను చేసే హక్కు ఉందని, సుప్రీంకోర్టు చట్టం అర్థాన్ని మాత్రమే వివరించాలని 368వ అధికరణ చెబుతుంది. అత్యున్నత న్యాయస్థానం బిల్లుల సంగతేమిటని రాష్ట్రపతిని, గవర్నర్‌ని ప్రశ్నిస్తోంది. రామమందిరం, కృష్ణ జన్మభూమి, జ్ఞానవాపి కేసులు వచ్చినప్పుడు పేపర్లు చూపించమని మీరు అడుగుతారు. మొఘలులు వచ్చాకే ఆ కట్టడాలన్నీ మసీదులయ్యాయి. పేపర్లు ఎక్కడి నుంచి తేవాలని అన్నారు. ఇలాంటి చర్యల వల్ల పార్లమెంట్ ఔన్నత్యం దెబ్బతింటోందని, దీనికి చీఫ్ జస్టిస్ట్ సంజీవ్ ఖాన్నాదే బాధ్యతని వ్యాఖ్యనించారు.

# తమిళంలో వైద్య విద్యాకోర్సులు

**ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమణ్యం వెల్లడి**

**చెన్నై, ఏప్రిల్ 19:** త్వరలోనే తమిళ మాధ్యమంలో వైద్యవిద్యా కోర్సులుండే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. తమిళంలో వైద్యకోర్సులు బిజెపి లక్ష్యం అని ప్రధాని మోడీ కూడా ఇలీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సైదాపేట సడయప్పన్‌వీధిలో కొత్తగా నిర్మించిన ఓ ప్రైవేటు ఆస్పత్రిని ప్రారంభించిన సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మీడియాతో మాట్లాడుతూ..తమిళ మీడియం కామెంట్స్ చేశారు. ఎగ్మోర్‌లోని ప్రభుత్వ ప్రసూతి కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన సంతాన సాఫల్య కేంద్రానికి ప్రజాదరణ పెరుగుతోందని, మదురై, సేలం, కోవై ప్రాంతాల్లో కూడా వీటిని ఏర్పాటు- చేయనున్నట్లు- ఆయన తెలిపారు. తమిళ మీడియంలో ఎంబీబీఎస్ పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నదే సీఎం స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మూడేళ్ళ క్రితమే వైద్యవిద్యకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను తమిళంలో తర్జుమా చేసే పక్రియను తమిళనాడు -టె-స్ట్‌బుక్స్ సొసైటీ- పూర్తిచేసిందని తెలిపారు. ఈ పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లో 7.5శాతం రిజర్వేషన్ కోటాలో చదువుకుని ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్‌లో చేరిన విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థులు ఐదేళ్ళ పాటు- తమిళ మాధ్యమంలో చదవడంలో పలు సమస్యలున్నాయని, వాటిని సడలించడంపై ఆలోచించి నిర్ణయం తీసుకోనున్నట్లు- మంత్రి వివరించారు. ముదల్వర్ మెడికల్ షాపుల్లో మందులకు కొరత ఏర్పడినట్లు- మీడియాలో వస్తున్న కథనాలు అవాస్తవమన్నారు. రాష్ట్రంలో మరో ఆరు వైద్యవిద్యా కళాశాలలను కొత్తగా ఏర్పాటు- చేసేందుకు అనుమతి కోరుతూ కేంద్రప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. రాష్ట్రంలోవున్న అన్ని వైద్యవిద్యా కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు పనిచేస్తున్నారని, రాయపురం స్టాన్లీ వైద్య కళాశాలలో మాత్రమే ప్రిన్సిపాల్ పోస్టు భర్తీ చేయలేదన్నారు. అయినప్పటికీ మెడికోల సంక్షేమార్థం తాత్కాలిక ప్రిన్సిపాల్‌ను నియమించినట్లు తెలిపారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిర్వహణలో వున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీ అయిన వైద్యులు, నర్సుల పోస్టుల భర్తీకి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖామంత్రి కేఎన్ నెహ్రూ చర్యలు చేపట్టారన్నారు.






# ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి

**కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ సూచన**

**హైదరాబాద్, ఏప్రిల్ 19:** ధాన్యం కొనుగోళ్లను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోళ్లను పర్యవేక్షించాలన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ ముఖ్య అధికారులతోనూ సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. ఈ ఏడాది యాసంగిలో రికార్డు స్థాయిలో 127.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. వానకాలం, యాసంగి కలిపి 281 లక్షల టన్నుల దిగుబడి వచ్చే అవకాశముంది. అందుకు అనుగుణంగా కొనుగోలు కోసం అధికారులు ఏర్పాట్లు- చేసుకోవాలని ఉత్తమ్ సూచించారు. ఎక్కడా సమస్యలు రాకుండా అధికారులను అప్రమత్తం చేయాలన్నారు.

# బీజేపీతో లోపాయకారి ఒప్పందం

**కేటీఆర్‌పై మహేశ్‌కుమార్ విమర్శలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 19 :** కేసుల నుంచి తప్పించుకునేందుకే బీజేపీతో బీఆర్‌ఎస్‌కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం కుదు-ర్చుకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. అందుకే బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యాచరణ ఒకేలా ఉంటోందన్నారు. అక్రమాలపై చర్యలు తీసుకోకూడదనే ఉద్దేశంతోనే మోదీకి కేటీఆర్ దాసోహమయ్యారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ బలహీనత వల్లే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాలేదని, పదేళ్లపాటు మోదీ తీసుకున్న నిర్ణయాలన్నింటికీ ఆ పార్టీ మద్దతిచ్చిందని అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారాస నాయకురాలు కవితను మద్యం స్కామ్ నుంచి కాపాడుకోవడానికి బీజేపీకి ఊడిగం చేశారని దుయ్యబట్టారు. బీజేపీకి కట్టు బానిసలా కేటీఆర్ పని చేస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆయన తాపత్రయ పడుతున్నారని విమర్శించారు. ఇటవలి పరిణామాలు గమనిస్తే వారిమధ్య ఉన్న బంధం తెలుసుకోవచ్చున్నారు. ఇరు పార్టీలది ఒకటే ఎజెండా అని అన్నారు.

# ప్రజలకు అండగా గులాబీ జెండా

**సన్నాహక సమావేశంలో నిరంజన్ రెడ్డి**



**జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 19:** ప్రజలకు అండగా గులాబీ జెండా ఎల్లప్పుడూ ఉంటుందని, ప్రతి కార్యకర్తను పార్టీ కాపాడుకొంటుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈనెల 27న వరంగల్‌లోజరిగే రజతోత్సవ సభకు భారీగా జన సమీకరణలో భాగంగా శనివారం కేటి దొడ్డి మండలం పాగుంట గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు-చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి గులాబీ జాతరకు దండుగా కదలి రావాలని పిలుపునిచ్చారు. సభకు వచ్చే ముందు ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. రాష్ట్ర ఏర్పాటు- నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాటు-పడ్డారని వివరించారు. రాష్ట్ర ఏర్పాటు- కోసం పదవులను సైతం లెక్కచేయక చావు దాక వెళ్లి తెలంగాణను సాధించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. ?కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని లక్ష్యంతో అధికారంలో ఉన్న పది సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిఈపారు. 25 సంవత్సరాల బీఆర్‌ఎస్ ప్రస్థానాన్ని రజతోత్సవ సభ ద్వారా భావితరాలకు స్ఫూర్తి కలిగించేందుకు సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేసీఆర్ విలువ బీఆర్‌ఎస్ అవసరం ప్రస్తుతం ప్రజలకు తెలిసి వచ్చిందన్నారు. ఉమిత్యాల తండాకు చెందిన కొంతమంది యువకులు మాజీ మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సమావేశంలో నాయకులు బాస్ హనుమంతు నాయుడు, నాగరిదొడ్డి వెంకట రాములు, కురువ పల్లయ్య ,చక్రధరరావు, శ్రీరాములు , మోనేష్ తదితరులు పాల్గొన్నారు .

# లోపాలను సరిదిద్దిన భూభారతి

**జనగామ, ఏప్రిల్ 19 :** రైతుల భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి చట్టం వచ్చిందని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ధరణిలోని లోపాలను భూ భారతి ద్వారా సవరించవచ్చు న్నారు. ధరణిలో పేర్లు తప్పు పడినా.. ఏ రకమైన సమస్య ఉన్నా సవరించుకునే అవకాశం లేదన్నారు. సాదాబైనామాలకు కూడా ధరణిలో పరిష్కారం లభించలేదన్నారు.భూ భారతిలో సమస్యలకు పరిష్కారం ఉంది.. అధికారులు మనసుపెట్టి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు.రైతులకు బ్రహ్మాండంగా అవగాహన ఉంది కానీ అధికారులనే ట్రైన్ చేయాలని ఎమ్మెల్యే కడియం అన్నారు. రైతులకు బెటర్ సర్వీసెస్ ఇచ్చే ప్రయత్నం చేయాలి కానీ సమస్య పరిష్కారం కాదని తిరిగి పంపించవద్దన్నారు. ఒకప్పుడు కలెక్టర్ మాట అంటే సొల్యూషన్ వచ్చేది... సీఎం కంటే పవర్ ఫుల్ ఉండేది..ఇప్పుడు ఆ వ్యవస్థ కూడా డైల్యూట్ అయిందన్నారు. భూ భారతి ద్వారా సమస్యలు తీరే అవకాశం ఉండడంతో రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు కడియం.



# మమతాబెనర్జీ రాజకీయ కుయుక్తులు !

పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతలు క్షీణిస్తున్నా.. అల్లర్లు పదేపదే చోటుచేసుకుంటున్నా.. సిఎం మమతా బెనర్జీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటోంది. తరచుగా అల్లర్లు జరుగుతున్నా వాటిని కఠినంగా అణచివేయడం లేదు. ఎప్పుడూ కేంద్రంపై తాచుపాములా బుసలు కొట్టడమే తప్ప అక్కడ శాంతిభద్రతలను కాపాడడంలో మాత్రం ఘోరంగా విఫలం అవుతున్నారు. ఒకటికాదు.. రెండు కాదు వరుస ఘటనలు అక్కడి ప్రశాంతతను దెబ్బతీస్తోంది. ఇదంతా కేవలం రాజకీయ ప్రాపకం కోసం చేస్తున్న ఎత్తుగడగా విమర్శలు ఉన్నాయి. వచ్చే యేడాది ఎన్నికల్లో మళ్లీ గెలవడమే లక్ష్యంగా మమతా బెనర్జీ కుయుక్తులు పన్నుతున్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానంద లాంటి వారు జన్మించిన నేల ఇప్పుడు రక్తసిక్తంగా మారుతోంది. కేవలం రాజకీయాలు చేయడం అలవాటు చేసుకున్న మమతకు స్వరాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో మాత్రం శ్రద్ధ లేకుండా పోయింది. అనేక సమస్యలు బెంగాల్‌ను ఆవరించాయి. ప్రధానంగా శాంతిభద్రతలు అదుపు తప్పాయి. అత్యాచార ఘటనలు పెరిగాయి. బంగ్లా నుంచి చొరబాట్లు పెరిగాయి. అక్రమ వసలదారులు అక్కడ తిష్టవేసి, ఆధార్ సహా అన్నీ పొందుతున్నారు. వారిని తన్ని తరిమేమకుండా వారికి సౌకర్యాలు కల్పించి, ఓటుబ్యాంక్‌గా మార్చుకున్న తీరు క్షమించరానిది. బంగ్లాదేశ్ నుంచి వేలాది మంది ఏటా వస్తూనే ఉన్నారు. దీంతో స్థానికంగా అల్లర్లకు వారు కూడా కారణం అవుతున్నారు. మైనార్టీలను బుజ్జగించే పనిలో అక్రమ వలసదారులను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అందుకే ఒకదాని వెంట ఒకటిగా చోటుచేసుకుంటున్న ఘటనలు ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలకు సవాలుగా పరిణమించాయి. సమస్యలను అర్థం చేసుకోకుండా కేంద్రాన్ని దుమ్మెత్తిపోయడం, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను తిట్టిపోయడంలో మమతా బెనర్జీ ఆరితేరారు. గతేడాది పార్ల మెంటు ఎన్నికలకు ముందు జరిగిన సందేశ్‌ఖలీ మానభంగాల కేసు విషయంలో నిజాయితీగా వ్యవహరించలేక పోయారు. అలాగే గత ఏడాది చివర్లో కోల్‌కతాలో జరిగిన ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులోనూ కఠినంగా వ్యవహరించలేకపోయారు. ఇవి ఎంతటి పెను వివాదాలకు కారణమయ్యాయో తెలిసిందే. ఈ మధ్య 26 వేల మంది స్కూలు టీచర్ల నియామకాలను సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టడంతో మరో వివాదం దీదీ ప్రభుత్వాన్ని అతలాకుతలం చేసింది. వీటికితోడు తాజాగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా అల్లర్లు మొదలయ్యాయి. వీటిని అణచివేయకుండా కేంద్రాన్ని తిట్టిపోస్తూ... వక్ఫ్ చట్టం బెంగాల్లో అమలు కాదని ప్రకటన చేశారు. మెడికల్ విద్యార్థి హత్యాచార ఘటనలో దేశవ్యాప్తంగా ఆందోళనలను చెలరేగాయి. కోల్‌కతాలో వైద్యుల నిరసనలు నెలలతరబడి సాగాయి. అయినా సిఎంగా మమతా బెనర్జీ సమర్థంగా వ్యవహరించలేకపోయారు. గత పదేళ్ల కాలంలో మొత్తం వ్యవహారాలను పరిశీలిస్తే కేవలం అధికార యావతప్ప మమతలో మరోటి కానరాదు. తన అధికారం నిలబెట్టుకునేందుకు ఆమె ఆందోళనలు ప్రోత్సహించడంతో పాటు..వాటిని ఉపేక్షిస్తారు. ఈ క్రమంలో తాజాగా వక్ఫ్ సవరణ చట్టం అమలులోకి రాగా, దేశంలో ఎక్కడా లేనంత తీవ్ర స్థాయిలో బెంగాల్‌లో అల్లర్లు మొదలయ్యాయి. నిజానికి యూపిలాంటి రాష్ట్రాల్లో కూడా అల్లర్లు జరగలేదు. ముస్లిం జనాభా ఎక్కువగా గల ముర్షీదాబాద్, మాల్దా, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాలు నిరసనలతో అట్టుడికాయి. ఈ అల్లర్ల వల్ల ముగ్గురు బలికాగా, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులు భారీస్థాయిలో ధ్వంసమయ్యాయి. నిరసనకారులు ప్రధాన రహదారుల్ని, రైల్వే ట్రాకుల్నీ దిగ్బంధం చేస్తూ ప్రజా జీవనానికి విఘాతం కలిగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టాన్ని అమలు చేయ-ంబోమని ముఖ్యమంత్రి మమత హామీ ఇచ్చినా అల్లర్లు తగ్గుముఖం పట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. బెంగాల్లో మమతా బెనర్జీ ముందునుంచీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తూ వచ్చారు. దీంతో అక్రమంగా వలసవచ్చిన వారు పాతుకు పోయారు. అల్లర్లలో వారే ప్రధాన పాత్ర పోషిస్తున్నారని బిజెపి ఎప్పటినుంచో ఆరోపిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలో విపక్ష భారతీయ జనతాపార్టీ, అధికార తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ స్వప్రయోజనాలపై పోరాటం చేస్తూనే ఉంది. మమత తీరును ఎండగడుతూ నే ఉంది. రోహింగ్యాలతో పాలు, అక్రమంగా సరిహద్దులు దాటి వస్తున్న వారిని అడ్డుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తూనే ఉంది. జరిగిన సంఘటనలకు బాధ్యత మీదంటే మీదే బాధ్యతంటూ ఇరు పార్టీలు దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. బెంగాల్‌లో ఎప్పుడు అల్లర్లు చెలరేగినా వాటిని కఠినంగా అణచివేయడంలో మమత బెనర్జీ ప్రభుత్వ విఫలం అవుతూనే ఉంది. ఇదంతా బిజెపి ప్లాన్ అంటూ తోసిపుచ్చడం, విమర్శలతో ఎదురుదాడి చేయడం అలవాటు చేసుకున్నారు. ఇటీవల 26 వేల మంది టీచర్ల నియామకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వ ప్రతిష్ఠ మంటగలవడంతో దానినుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకు వేసిన ఎత్తుగడలో భాగంగానే అల్లర్లను ప్రేరేపించారనని బిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. దీనిని అడ్డుకు నేందుకు ముఖ్యమంత్రి.. వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిన కేంద్రమే అల్లర్లకు బాధ్యత వహించాలనే రీతిలో మాట్లాడుతున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన చట్టం గురించి కేంద్రాన్నే అడగాలని, రాజకీయాలకోసం అల్లర్లకు దిగవద్దని ఆమె ఇచ్చిన పిలుపునకు నిరసనకారులు ఏమాత్రం స్పందించడం లేదు సరికదా మరింత పేట్రేగిపోయారు. అల్లర్లకు కేంద్ర బిందువైన ముర్షీదాబాద్ జిల్లాలో ముస్లిం జనాభాదే ఆధిపత్యం. ఈ జిల్లాలోని మూడు పార్లమెంటు సీట్లనూ తృణమూల్ గెలుచుకుంది. 22 అసెంబ్లీ స్థానాల్లో 20 సీట్లకు తృణమూల్ సభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లోనూ ఆ పార్టీదే పైచేయి. అలాంట ప్పుడు, అల్లర్లు ఎలా చెలరేగాయన్న ప్రశ్నకు అధికార పార్టీనుంచి జవాబు లేకపోవడం గమనార్హం.గతంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చినప్పుడూ ముర్షీదాబాద్ భగ్గుమంది. ఇంతటి సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతంలో ముందుజాగ్రత్త చర్యలు ఎందుకు తీసుకోలేదో ప్రభుత్వమే జవాబు చెప్పాలి. వక్ఫ్ చట్టంలో లొసుగులున్నాయని ఎవరైనా భావిస్తే, వాటిని న్యాయస్థానాలలో సవాల్ చేసే హక్కు ఉంది. అంతే తప్ప, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అల్లర్లకు దిగడం సమంజసం కాదు. అయితే ఇక్కడ మమతా బెనర్జీ అల్లర్లను అదుపు చేయకుండా ప్రేక్షక పాత్ర వహించడంపై సర్వత్రా అనుమానాలు ఉన్నాయి. బాధ్యతా యుతమైన సిఎం పదవిలో ఉన్న దీదీ పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ చట్టాన్ని అమలు చేయబోమని ఎలా చెబుతారనేది ప్రజలకు వివరణ ఇవ్వాలి. టిఎంసి ప్రభుత్వం అల్లర్లను నిర్దాక్షిణ్యంగా అణచివేసి, తన చిత్తశుద్ధిని నిరూపించుకుని ఉంటే అనుమానాలు వచ్చేవి కావు. మరో ఏడాదిలో శాసనసభ ఎన్నికలకు సమాయత్తమవుతున్న బెంగాల్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు కేవలం రాజకీయం కోసమే అన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు.

# కోపాన్ని అదుపులో పెట్టుకోవాలి!




**తిరుమల, ఏప్రిల్ 19:** కోపాన్ని మనసు నుంచి తొలగించుకొనేందుకు మనిషికి నిరంతర సాధన చేయాలి. అలా చేస్తే శరీరం అదుపులోకి వస్తుంది. కోపం జయిస్తే ఇంద్రియాలను జయించవచ్చు. వసిష్ఠుడి మీద కోపంతో విశ్వామిత్రుడు ఘోర తపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్షం కాగా ధనుర్వేద రహస్యాలను బోధించమని కోరతాడు. శివుడు అంగీకరించి అన్ని అస్త్ర విద్యలను సిద్ధింపజేస్తాడు. ఆ అస్త్రాలను వసిష్ఠుడిపై ప్రయోగించగా ఆయన తన తపశ్శక్తితో వాటిని నిలువరిస్తాడు. క్షత్రియుడిగా ఉండి బ్రహ్మర్షిని జయించడం కష్టమని విశ్వామిత్రుడు తెలుసుకుంటాడు. బ్రహ్మర్షిగా మారడానికి దీర్ఘకాలం తపోదీక్ష వహిస్తాడు. బ్రహ్మ ప్రత్యక్షమై బ్రహ్మర్షిత్వాన్ని పొందావని చెప్పినా అతడిలో పూర్తిగా సంతోషం కలగదు. వసిష్ఠుడితో 'బ్రహ్మర్షీ!' అని పిలిపించుకోవాలని ఉందన్న కోరికను తెలియజేస్తాడు. వసిష్ఠుడు అలాగేనని పలుకుతాడు. అయితే ఆయన పూర్తిగా క్రోధాన్ని విడిచిపెట్టాడో లేదో తెలుసుకోవాలనే ఉద్దేశంతో విశ్వామిత్రుడు తనవద్దకు వస్తేనే బ్రహ్మర్షీ అని పిలుస్తానని చెబుతాడు. విశ్వామిత్రుడు వసిష్ఠుడి వద్దకు వెళ్లగా ఎందుకు వచ్చావంటూ ప్రశ్నించి దూరంగా పొమ్మంటాడు. ఆయన వెళ్లబోతుండగా మరలా రమ్మంటాడు. ఇలా పదేపదే చేసినా విశ్వామిత్రుడి ముఖంలో ప్రశాంతత చెదరకపోయే-సరికి నిజంగానే బ్రహ్మర్షివయ్యావంటూ అభినందిస్తాడు. పతన హేతువైన క్రోధాన్ని గెలిచి చూడు, నువ్వే విశ్వామిత్రుడివవుతావు. అందుకే మనలో ఉన్న క్రోధాన్ని జయిస్తే..ప్రపంచాన్ని జయించడమే కాదు..భగవంతుడినీ జయించవచ్చు.



# ఢిల్లీలో కుప్పకూలిన భవనం

## నలుగురు మృతి.. శిథిలాల కింద దాదాపు రెండు డజన్ల మంది

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:** ఢిల్లీలోని ముస్తఫాబాద్ ఏరియాలో శనివారం తెల్లవారుజామున నాలుగు అంతస్తుల భవనం కుప్ప కూలింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. శిథిలాల కింద దాదాపు రెండు డజన్ల మంది చిక్కుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు కనీసం 14 మందిని రక్షించామన్నారు. శిథిలాల కింద మరింత మంది ఉండే అవకాశం ఉన్నట్లు- తెలిపారు. ఘటన స్థలంలో పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందం, అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కెనడాలో దుండగుల కాల్పుల్లో భారతీయ యువతి మృతి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:** కెనడాలో భారతీయుల వరుసగా హత్యకు గురవుతున్నారు. ఒట్టావా సమీపంలోని రాక్‌లాండ్ ప్రాంతంలో ఓ భారతీయుడు కత్తి పోట్లకు గురై మృతి చెందిన విషయం మరువక ముందే మరో భారతీయురాలు కాల్పుల్లో మృతి చెందింది. భారత కాన్సులేట్ తెలిపిన వివరాల ప్రకారం.. హమిల్టన్‌లోని కాలేజీలో చదువుతున్న హర్‌సిమ్రత్ రంధవా ఓ దుండగుడు కాల్పులో మృతి చెందింది. రంధవా బస్టాప్ వద్ద వేచి ఉండగా.. రెండు కార్లలో వచ్చిన ఇద్దరు దుండగులు ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకున్నారు. అయి-ంతే, అందులోని ఓ బుల్లెట్ మిస్ అయ్యి రంధవాకు తగిలింది. ఘటనపై సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆమె అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు- వైద్యులు ధ్రువీకరించారు. హర్‌సిమ్రత్ రంధవా మతిపై భారత కాన్సులేట్ దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. మృతురాలి కుటు-ంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని, అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చింది.

# అందుబాటులోకి శ్రీవారి సేవా టికెట్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 19:** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి భక్తులకు టీటీడీ శుభవార్త చెప్పింది. జులై నెలకు సంబంధించి సుప్రభాతం, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జిత సేవా టిక్కెట్ల కోటాని విడుదల చేసింది. శనివారం ఈ ఉదయం 10 గంటల నుంచే ఆన్‌లైన్ ద్వారా టికెట్లు- అందుబాటులోకి వచ్చాయి. సేవలో పాల్గొనాలనుకునేవారు ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు- పొందొచ్చు. ఇక, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవల జులై నెల కోటాను సోమవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. వర్చువల్ సేవలు కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు. జులై కోటాకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్లు ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 10 గంటలకు విడుదల కానున్నాయి. శ్రీవాణి ట్రస్ట్ టికెట్లు 23వ తేదీ ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉచిత దర్శనం ఆదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు అందుబాటులోకి రానున్నాయి.

# అమాయక యువతులతో వ్యభిచారం

## గుట్టురట్టు చేసిన పోలీసులు



**హైదరాబాద్, ఏప్రిల్ 19:** సికింద్రాబాద్ పరిధిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టు అయ్యింది. రాంగోపాల్‌పేటలోని బాపుబాగ్ కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్ వచ్చిన అమాయక యువతులకు మాయమాటలు చెప్పి వ్యభిచారంలోకి దింపుతున్నారు. ఈక్రమంలో సమాచారం అందుకున్న పోలీసులు.. స్వప్న అనే మహిళ యువతులను వ్యభిచారంలోకి లాగుతున్నట్లు గుర్తించారు. దీంతో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై పోలీసులు దాడులు చేశారు. ముఠా నుంచి ఇద్దరు యువతులను రక్షించారు. ముఠాలోని మహమ్మద్ అవియాస్, హుస్సేన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న లడ్డు, స్వప్న కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# పెళ్లి వేడుకకు వెళ్లివస్తుండగా దాడి

## చెక్ చేస్తున్న సమయంలో చేయిచేసుకున్న సైనికులు

### ఇగ్నో ప్రొఫెసర్ ఆరోపణలపై సైన్యం విచారణ

**శ్రీనగర్, ఏప్రిల్ 19:** జమ్మూకశ్మీర్‌లో వాహనాల తనిఖీ సమయంలో కొందరు సైనికులు తనపై దాడి చేశారని యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు ఆరోపించారు. దీనిపై భారత సైన్యాధికారులు విచారణ చేపట్టారు. రాజౌరీ జిల్లాలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ఇగ్నోలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న లియాఖత్ అలీ మరికొందరితో కలిసి ఒక వివాహ వేడుకకు హాజరై కలకోట్‌కు తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్మీ సిబ్బంది తనపై దాడి చేశారని అలీ ఆరోపించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. 'నా కుటుంబంలోను ఎంతోమంది సైన్యంలో ఉన్నారు. అందుకు నేను ఎంతో గర్వపడతాను. కానీ, ఈ రోజు జరిగిన ఘటన ఆ గౌరవాన్ని తగ్గించింది. వారు నా గుర్తింపుకార్డును చూపించమన్నారు. అది చూపించేందుకు కారు దిగుతున్న నాపై అనూహ్యంగా దాడి చేశారు. వారి ఆయుధాలతో నా తలపై కొట్టి గాయపరిచారు. దీనికి వాళ్లు నాకు క్షమాపణ కూడా చెప్పలేదు. సైన్యం మన దేశానికి గర్వకారణం. నాకు న్యాయం జరగాలి' అని ప్రొఫెసర్ పేర్కొన్నారు. తన తలకు ఆరుకుట్లు పడినట్లు ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెల్లడించారు. దీనిపై ఆర్మీ అధికారులు స్పందించారు. ఉగ్రవాద కదలికలపై సమాచారం అందడంతో సైనిక సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలోనే ఈ ఘటన చోటు చేసుకుందని వెల్లడించారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు- పేర్కొన్నారు. అయితే, తనిఖీ సమయంలో ఆ వ్యక్తి విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి ఆయుధాలు లాక్కునేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆయన సిబ్బందితో గొడవ పడినట్లు వెల్లడించారు. దీనిపై పూర్తి విచారణ జరిపి, సిబ్బంది ఎవరైనా దురుసుగా ప్రవర్తించినట్లు- తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనను పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఖండించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్మీని కోరారు. జమ్మూకశ్మీర్ భాజపా మాజీ అధ్యక్షుడు రవీందర్ రైనా



కూడా దీనిపై స్పందించారు. మన దేశంలో చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. దాడి ఎవరు చేసినా వారు తగిన పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని ప్రొఫెసర్‌కు హామీ ఇచ్చారు.

# భూ భారతితో రైతు భూములకు పూర్తి భరోసా

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**హుజురాబాద్ లో భూభారతిపై అవగాహన సదస్సు**



హుజురాబాద్ ఏప్రిల్ 19 జనతా న్యూస్: రైతుల భూములకు భరోసాను భూభారతి చట్టం కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం) -2025 పై శనివారం హుజురాబాద్ లోని ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూముల పై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా లభించనుందని అన్నారు. రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, తదుపరి భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టాలు ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. గతంలో తహసిల్దారు పరిష్కరించే చిన్న చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని, వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. భూభారతి ద్వారా కింది స్థాయికి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని దీనివల్ల భూమికి సంబంధించిన చిన్న సమస్యలు మండల స్థాయిలోని సత్వరం పరిష్కారం అవుతాయని తెలిపారు. ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు 33 మాడ్యూల్స్ పొందుపరచాలని, దీనివల్ల ఏ సమస్యకు ఏ మాడ్యూల్ లో దరఖాస్తు చేయాలో అర్థం కాకుండా ఉండేదని అన్నారు. భూభారతిలో 4 మాడ్యూల్స్ మాత్రమే ఉండి సులభమైన దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ధరణిలో సవరణకు, సమస్యల పరిష్కారానికి, కింది స్థాయి అధికారులకు ఎటువంటి అధికారాలు లేనందున వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్ ఉండేవని, ఆరు నెలల క్రితం అధికారాలు విభజించడం ద్వారా సమస్యలు త్వరగా పరిష్కారం అవుతున్నాయని అన్నారు. భూములకు సంబంధించిన అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం దొరికిందని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో ఇలాంటి అవకాశం లేదని తెలిపారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఎంతోమంది మేధావులు, అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేశారని వివరించారు. హుజురాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ మాట్లాడుతూ భూభారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, తహసీల్దార్ కనకయ్య, రెవిన్యూ, వ్యవసాయ, పంచాయతీ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## చెట్టు విరిగి ఉపాధి హామీ కూలీలకు గాయాలు



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని బేగంపేట గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న ( ల్యాండ్ డెవలప్మెంట్ ప్రోగ్రాం) పని బుష్ క్లియరెన్స్ జరుగుతున్న సమయంలో చెట్టు విరగడంతో ఇద్దరు కూలీలకు గాయాలవగా వారిని స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ కట్ట రవీందర్ కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎంపీడీవో కే ప్రవీణ్ శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. గాయాలైన వారు బుర్ర పద్మ కు కాలు ప్యాక్చర్ అయినట్లు, కొరివి శ్యామల కు స్వల్ప గాయాలైనట్లు, ఇద్దరికీ వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు.

## జేఈఈ మెయిన్స్ లో ఎస్సార్ కి ర్యాంకులు



తిమ్మాపూర్, జనతా న్యూస్ : అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ మెయిన్స్-25 లో ఎస్సార్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ర్యాంకుల పంట పండింది. జేఈఈ మెయిన్స్ లో కరీంనగర్ జిల్లాలోని ఎస్ ఆర్ కళాశాలకు చెందిన 186 మంది విద్యార్థులు ప్రతిభను కనబరిచి అడ్వాన్స్ కు అర్హతను సాధించినట్లు కరీంనగర్ జిల్లా ఎస్సార్ కళాశాలల జోనల్ ఇంచార్జ్ నేదురు తిరుపతి తెలిపారు. శనివారం అలుగునూర్ లోని ఎస్సార్ కళాశాల ఆవరణలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్ఆర్ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకును, మిగతా 176 మందికి పైగా విద్యార్థులు వివిధ ర్యాంకులను సాధించి జేఈఈ అడ్వాన్స్ లో విజయ పతాకాన్ని ఎగరవేసినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 12లక్షల 50వేల మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 2లక్షల 20వేల మంది అర్హత సాధించారని తెలిపారు. ఇందులో ఎస్ఆర్ కళాశాలకు చెందిన 600మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 186 మందికిపైగా అర్హత సాధించినట్లు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు వై భరణి శంకర్ జాతీయస్థాయిలో 88వ ర్యాంకు, బీ సురేష్ 98వ ర్యాంకు, ఏ కార్తిక్ 584వ ర్యాంకు, లకావత్ మాధవ్ చరన్ 707వ ర్యాంకు, లునావత్ రామ్ చరణ్ 777వ ర్యాంకు, పత్తెం హృషికేష్ 796వ ర్యాంకు సాధించగా వారితోపాటు మరో ఏడుగురు విద్యార్థులు 6వేలలోపు ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. ఇంతటి విజయాన్ని అందించి, కళాశాలకు జాతీయస్థాయి-యిలో పేరు తీసుకొచ్చిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, కరీంనగర్ డీజీఎం వాసుదేవ రెడ్డి, కరీంనగర్ జోనల్ ఇన్చార్జ్ నేదురు తిరుపతి, ఎస్ఆర్ కళాశాలల

డీన్స్, ప్రిన్సిపాల్స్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# ఐ.ఐ.టి జేయియి మెయిన్స్ 2025 ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థికి 49 వ ర్యాంకు

**అల్ఫోర్స్ ఐ.ఐ.టి జేయియి మెయిన్స్ ఫలితాలలో "అల్ఫోర్స్" కు ర్యాంకుల పంట**




కరీంగనర్,జనతా న్యూస్: శనివారం ప్రకటించిన ఐ.ఐ.టి జేయియి మెయిన్స్ 2025 ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయస్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఆ సంస్థల చైర్మన్ డా వి. నరేందర్ రెడ్డి తెలిపారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్. శరణ్య 49 వ ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలువగా, పి. శ్రీహర్ష 244 వ ర్యాంకు, ఎన్. అనిరూద్సాయి 272, డి. విశాల్ 329, జె. వామిక 350, టి. ప్రణతి 456, యి. అంకిత్సాయి 574 ,బి. అదిత్యా 630, టి. షివాత్మిక 646, వి. హృషికేష్ 703, మహ్మట్అబ్దులాక్ 968, పవార్బాల్ 1056 . 1148, 2.25 1270, 2. 1298, 1343, . 53 1378 అర్.సుమిత్ కుమార్ 1637, డి.కార్తిక్ రెడ్డి 1826, మహ్మద్ముల్లన్ 1989, బి. విష్ణు 2000, వ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.దీనితో పాటుగా 1000 లోపు - 11 ర్యాంకులు, 2000 లోపు - 21 ర్యాంకులు, 5000 లోపు - 40 ర్యాంకులు ర్యాంకులు సాధించగా, 459 మంది విద్యార్థులు ఐ.ఐ.టి అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడం విశేషం అని అన్నారు. రాబోయే ఐ.ఐ.టి అడ్వాన్స్ పరీక్ష వ్రాయుటకు ఎంపికైన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందముచే కోచింగ్ ఇవ్వబడునని. పటిష్ట ప్రణాళికతో విద్యా బోధన మరియు నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల పట్టుదల మరియు అహర్నిషల కృషివల్ల అల్ఫోర్స్ ఇంతటి ఘన విజయం సాధించగలిగిందని నరెందర్ రెడ్డి పేర్కొన్నారు.








## వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే





జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని కల్లేపల్లి దాచారం, గుగ్గిళ్ళ గ్రామాలలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఐకెపి ఆధ్వర్యంలో నడు-స్తున్న వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించినట్లు ఐకెపి ఏపీఎం గైర నరసయ్య పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ దళారులను నమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం 500 రూపాయలు సన్న వడ్లకు బోనస్ ఇస్తుందని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే వడ్లు విక్రయించాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, సీసీలు తిరుపతి, పద్మ, సారయ్య, ఆయా గ్రామాల కార్యదర్శులు , వివో ఏ లు సరోజన, అశ్విని, లక్ష్మణ్, రైతులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభ అనంతరం స్థానిక శాసనసభ్యులు మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలిసి మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు 18 మందికి 5 లక్షల 56 వేల విలువగల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా, నిమ్స్ లాంటి ప్రభుత్వ ఆసుపత్రుల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, వివిధ అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ ను "స్వచ్ఛ, హరిత హుజురాబాద్" గా తీర్చిదిద్దాలి

**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**




హుజురాబాద్ ఏప్రిల్ 19 జనతా న్యూస్: హుజురాబాద్ పట్టణ పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ "స్వచ్ఛ, హరిత హుజురాబాద్" గా మార్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హుజురాబాద్ లోని సాయి రూప గార్డెన్లో ఏర్పాటుచేసిన స్వచ్ఛ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌశిక్ మాట్లాడారు. హుజురాబాద్ లోని 30 వార్డులను అందంగా తీర్చిదిద్దాలని అన్నారు. అలాగే ప్రజలు కూడా స్వచ్ఛ హుజురాబాద్ కోసం సహకరించాలని అన్నారు. చెత్తను బయట వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అప్పగించి తమ పరిసరాలతో పాటు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. చెత్తను బయట వేయడం వల్ల పారిశుధ్య సమస్య తలెత్తుతుందని, తద్వారా ప్రజలకు అంటు రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. మరో నెల రోజులు వేసవికాలం ఉందని, పెదనంతరం వర్షాకాలంలో పెద్ద ఎత్తున పట్టణంలో మొక్కలు నాటాలని హరిత హుజురాబాద్ గా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ కార్యక్రమం కూడా విజయవంతం కాదని, మునిసిపల్ అధికారులు ప్రజలను స్వచ్ఛంద సంస్థలను స్వచ్ఛ హరిత హుజురాబాద్ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. అనంతరం పట్టణంలోని వివిధ పాఠశాల విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మాజీ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, పి ఎస్ సి ఎస్ చైర్మన్ ఎడవల్లి కొండల్ రెడ్డి, కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు కిషన్ రావు, అనిత, ఫైర్ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులతో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# హుజురాబాద్లో ఎక్సైజ్ అధికారుల ఆగడాలు

**బెల్ట్ షాపులపై దౌర్జన్యం.. సిండికేట్కు వత్తాసు**

**అధికారుల తీరుపై మందుబాబుల ఆగ్రహం**

(కోరెం సుధాకర్ రెడ్డి జనతా న్యూస్ ప్రతినిధి హుజురాబాద్) : హుజురాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అధికారులు సిబ్బంది మద్యం సిండికేట్కు వంత పాడుతున్నారు. మద్యం వ్యాపారులు సిండికేట్ గా మారి అందినంత దోచుకుంటున్నారు. ఇటీవల రంగాపూర్ గ్రామంలో ఓ బెల్ట్ షాపులో మద్యం ప్రియులు మద్యం సేవిస్తుండగా.. స్థానిక ఎక్సైజ్ ఎస్సై ఒకరు వెళ్లి మందుబాబులు తాగుతున్న మద్యం సిండికేట్కు సంబంధించింది కాదని నానా రభస చేశాడు. బెల్ట్ షాప్ లో ఉన్న మద్యాన్ని తీసుకువెళ్లాడు. బెల్ట్ షాపు యజమానితో పాటు అక్కడున్న మందుబాబులను భయభ్రాంతులకు గురి చేశాడు. మద్యం సిండికేట్ కు సంబంధించిన సంతకం బాటిల్ పై ఉంటేనే విక్రయించాలని చెప్తున్నట్టు తెలుస్తోంది. మద్యం వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు.



లక్షలాది రూపాయలు అక్రమంగా ఆర్జిస్తున్నారు. రంగాపూర్ గ్రామంలో జరిగిన విషయాన్ని కొందరు కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కాంత్ దృష్టికి తీసుకు వెళ్లినట్టు తెలిసింది. ఈ విషయమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని సూపరింటెండెంట్ చెప్పినట్టు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం బెల్ట్ షాపులు నడవడానికి వీలు లేదు. ఎక్సైజ్ అధికారులు ప్రతినెల మామూలు తీసుకొని దుకాణాలను నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. బెల్ట్ షాపుల్లో తమ వద్ద తీసుకున్న మద్యమే విక్రయించాలంటూ.. సిండికేట్ వ్యాపారులు బెల్ట్ షాపులో యజమానులను ఒత్తిడికి, బెదిరింపులకు గురి చేస్తున్నారు. మద్యం వ్యాపారులకు ఎక్సైజ్ అధికారులు పూర్తిగా అండగా నిలుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, మద్యం వ్యాపారులు తమ తీరు మార్చుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఎల్కతుర్తి భూమిని తాకేందుకు ప్రజల ఆరాటం

**కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడింది**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి**

**ఎల్కతుర్తి లో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన జగదీశ్వర్ రెడ్డి**



హుజురాబాద్. ఏప్రిల్ 19 జనతా న్యూస్: తెలంగాణ ప్రజలు ఏప్రిల్ 27న ఎల్కతుర్తికి వచ్చి ఇక్కడి నేలను తాకేందుకు.. ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాడేందుకు ఉత్సాహంగా ఉన్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో బి ఆర్ ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏప్రిల్ 27న హాజరయ్యే బహిరంగ సభ ఏర్పాట్లను జగదీశ్వర్ రెడ్డి హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ నిజస్వరూపాన్ని ప్రజలు గుర్తించాలని, ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఏ ప్రజలు అయితే కాంగ్రెస్కు ఓటు వేశారో.. వారే తీవ్రంగా ఎందుకు ఓటేసామా? అని పశ్చాత్తాప పడుతున్నారని ఆయన అన్నారు. గడచిన ఏడాదిన్నరలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని అన్నారు. ఎల్కతుర్తి సభకు రావాలని, కెసిఆర్ ను చూడాలని, ఆయన సందేశం వినాలని ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని ఆయన తెలిపారు. బహిరంగ సభ ఏర్పాట్లు అద్భుతంగా జరుగుతున్నాయని, సువిశాల ప్రాంగణంలో ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారని, లక్షలాదిమంది సభకు హాజరు కారు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి కెసిఆర్ కు సంఘీభావం తెలపాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్రావు, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, ఏనుగుల రాకేష్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్చార్జ్ జగన్ రెడ్డి, స్థానిక నాయకులు తంగెడ మహేందర్, తంగడ నగేష్, హెల్తురి స్వామి, గొల్ల మహేందర్, చిగురు మామిడి, హుస్నాబాద్ టౌన్, మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు... తడిసిన ధాన్యాన్ని కూడా కొంటాము

**రైతులు ఆందోళన చెందొద్దు**

**జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



**జనగామ, ఏప్రిల్ 19 :** అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని కాబట్టి రైతులు ఎలాంటి ఆందోళన చెందరాదని

జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. తడిసిన ప్రతి ధాన్యం గింజను మద్దతు ధరకే కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ధాన్యాన్ని మిల్లర్లకు తరలించడమే కాకుండా రైతు ఖాతాలో నగదు జమ అయ్యేంతవరకు అధికారులు బాధ్యత వహించాలన్నారు. జిల్లాలో రా రైస్ మిల్లులు (42), బాయిల్డ్ రైస్ మిల్లులు (18)తో మొత్తంగా (60) రైస్ మిల్లులు ఉన్నాయన్నారు. ధాన్యంపై ఎవరూ కూడా కోతలు పెట్టకూడదని, మిల్లుల్లో హమాలీలను అధిక సంఖ్యలో నియమించుకొని ధాన్యం బస్తాలను త్వరగా అన్ లోడింగ్ చేయాలని పేర్కొన్నారు. అదే విధంగా ధాన్యం విక్రయాలపై రైతులకు పూర్తిస్థాయి-ంలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్క నిర్వాహకులు అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా వాతావరణ పరిస్థితులను బట్టి రైతులకు సూచనలు ఇస్తూ నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డీపీసీ అధికారులు టీంల వారీగా ఒక మండలంలోని నాలుగు పీపీసీ కేంద్రాలను సందర్శించి, అక్కడి రైతులకు ధాన్యం కొనుగోళ్లు, తేమ శాతం, విక్రయాలు, అకాల వర్షాలపై అవగాహన కల్పించాలన్నారు. కొనుగోళ్లు చేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సరిగా జరిగే విధంగా, ఎక్కడా కూడా ఎటువంటి సమస్య తలెత్తకుండా జిల్లా, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శనివారం జిల్లాలోని రఘునాథపల్లి తదితర మండలాల లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించి, రైతుల చిరునామా, ఫోన్ నంబరులను సరైన విధంగా నమోదు చేయాలని, అధిక సంఖ్యలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని, అకాల వర్షాల దృష్ట్యా వాతావరణానికి అనుగుణంగా తగిన జాగ్రత్త చర్యలు ముందుగానే చేపట్టాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో ఐకేపీల ద్వారా (114), ప్రాథమిక సహకార సంఘాల ద్వారా (67)తో మొత్తంగా (181) ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు (1,493) రైతుల వద్ద (8091) మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. అలాగే (85) మంది రైతుల నుంచి (305) మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేశామని, అదే విధంగా (1,408) రైతుల వద్ద (7786) మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో మొత్తం (4,200) టార్పాలిన్ లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్ లు, ఎంపిడిఓలు, మండల, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, తనిఖీ చేయాలని సూచించారు.

ఈ మేరకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశానుసారం.. జిల్లాలోని ఎంపిడిఓలు, మండల, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్ లు,

జిల్లాలోని అన్ని రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులు సందర్శించి, పర్యవేక్షిస్తున్నారు.

ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. తదనంతరం రైతులతో మమేకమై మాట్లాడారు. ఏమైనా కోతలు జరిగాయా?కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయ్యా? అని అడుగగా, రైతులు స్పందిస్తూ.. కొనుగోలు కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు కలగలేదని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా సివిల్ సప్లై అధికారి సరస్వతి, డి ఏం సివిల్ సప్లైహతీ రామ్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీలక్ష్మీనరసింహునికి వెండి కలశాలు బహూకరణ



**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి శనివారం పలువురు భక్తులు వెండి కలశాలు, వెండి ఏకహారతి, వెండి ధూప హారతిని సమర్పించారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ కు చెందిన బిరదవోలు వరశ్రీ అనే భక్తురాలు స్వామివారికి ఏడు కిలోల వెండితో చేసిన 11 కలశాలు, ఒక ఏకహారతి, ఒక ధూప హారతి స్వామివారికి సమర్పించగా.. హైదరాబాద్ కు చెందిన డాక్టర్ బీవీఎస్ రాంప్రసాద్ అనే మరో భక్తుడు సుమారుగా ఒక కిలో వెండితో చేసిన రెండు కలశాలు అందజేశారు. ఇట్టి వెండి పాత్రలకు దాతలు ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉ త్సవమూర్తుల పాదాల చెంత పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో భాస్కర్ రావు చేతుల మీదుగా వెండి కలశాలు, హారతి పాత్రలను ఆలయానికి అందజేశారు. అంతకుముందు దాతలు వారి ఫ్యామిలీలతో కలిసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**స్వామివారి సేవలో గుజరాత్ హైకోర్టు జడ్జి**

యాదగిరిగుట్ట నరసింహస్వామిని గుజరాత్ హైకోర్టు జడ్జి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ దర్శించుకున్నారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఈవో భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోండి


**ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్ , మహాత్మనగర్, తిమ్మాపూర్, రామకృష్ణ కాలనీ, ఇంద్రనగర్హోగ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రేడ్ A రకానికి రూ. 2320, సాధారణ రకానికి 2300 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.రైతులు దళారులకు అమ్మి మోసపోకుండా..కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. తూకం ఎక్కువ వేస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తూకం వేసిన 24 గంటల్లోగా డబ్బులు తమ అకౌంట్లోహజమ అవుతున్నారని స్పష్టం చేశారు. అనంతరం మహిళా కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బండారి రమేష్,జిల్లా నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు,గంకిడి లక్ష్మారెడ్డి,పోలు రాము రమేష్, గొట్టిముక్కుల సంపత్ రెడ్డి,సుంకె నరెందర్,దావు సంపత్ రెడ్డి,కొత్త తిరుపతిరెడ్డి,కుంట రాజేందర్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, రైతులు ఉన్నారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరండి

**పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే రసమయి**



**తిమ్మాపూర్, జనతా న్యూస్ :** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఆయన రజతోత్సవ సభ పోస్టర్ను ఆవిష్కరించిన అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.హమానకొండూర్ నియోజకవర్గం నుండి 10 వేలు , తిమ్మాపూర్ మండలం నుంచి 2 వేలు మందిని తరలిస్తామని చెప్పారు. మొదటగా ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగురవేసి.. సభకు బయలుదేరాలని కార్యకర్తలకు సూచించారు. ఒక సమ్మక్క సారలమ్మ జాతరను తలపించేలా.. రజతోత్సవ సభ ఉంటుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి ప్రజలు మర్చిపోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల రమేష్,రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం,ల్యాగల వీరారెడ్డి,మాతంగి లక్ష్మణ్, పాశం అశోక్ రెడ్డి,అనబేరి రాధాకిషన్ రావు, సంగుపట్ల మల్లేశం, బోయిని కొమురయ్య,మాదన రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ నగర సిపిఐ నూతనకమిటీఎన్నిక






కరీంనగర్, జనతా న్యూస్: సిపిఐ కరీంనగర్ నగర 11వ మహాసభలో నగర నూతన కమిటీని శుక్రవారం రోజున ఎన్నుకోవడం జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఐ నగర కార్యదర్శిగా కసిరెడ్డి సురేందర్ రెడ్డి సహాయ కార్యదర్శులుగా

పైడిపల్లి రాజు న్యాలపట్ల రాజు కోశాధికారిగా బీర్ల పద్మ లతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులు 29 మంది కౌన్సిల్ సభ్యులను నూతనంగా ఎన్నుకోనైనదని వారు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ నగరంలో సిపిఐ పార్టీని వాడవాడనా బలోపేతం చేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ జెండా మున్సిపల్ పై ఎగిరే విధంగా పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేస్తామన్నారు. నగరంలో వేలాది మంది ప్రజలు ఇండ్లు లేక కిరాయి ఇండ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు వచ్చేంతవరకు పోరాటాలు చేస్తామని, రేషన్ కార్డులు,పెన్షన్లు ఇతర సంక్షేమ పథకాలన్నీ పేద ప్రజలకు అందేందుకు కృషి చేస్తామన్నారు. ఎన్నికకు సహకరించిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామికి ధన్యవాదాలు తెలియజేశారు.

# టిటిడిలో అవకతవకలపై అవసరమైతే ఎసిబి విచారణ

**టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడి**

**తిరుమల, ఏప్రిల్ 19 :** టిటిడిలో జరిగిన పలు అవకతవకలపై అవసరమైతే ఎసిబి విచారణ కోరతామని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు అన్నారు. టిటిడి గోశాలలో ఆలిండియా గోసంరక్షణ సంస్థ ప్రధాన కార్యదర్శి, టిటిడి గో సంరక్షణ పూర్వ సభ్యులు కోటి శ్రీధర్తో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. టిటిడి గోశాలపై కోర్టుల్లో పిల్స్ దాఖలు చేస్తామని కొంతమంది ఫోన్లు చేస్తున్నారని, వారిని ఒకటే కోరుతున్నానని, గత ఐదేళ్ల పాలనలో టిటిడిలో జరిగిన నిధుల స్వాహా, అవకతవకల అంశాలను జోడించి కోర్టుల్లో కేసులు దాఖలు చేస్తే వారికి పూర్తి సహకారం అందిస్తామని చైర్మన్ తెలిపారు. గతంలో పింక్ డైమండ్ మీద కోర్టులో కేసు వేశారని, ఆ కేసు ఏమైందని ప్రశ్నించారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక టిటిడిలో ఎలాంటి అవినీతి జరుగలేదని తాను హామీ ఇస్తున్నానని చెప్పారు. టిటిడిలో గత పది నెలల్లో ఏమి జరగకపోయినా ఏదో జరిగిపోతున్నట్లు- కొంతమంది ఉద్దేశపూర్వకంగా చేస్తున్న గ్లోబల్ ప్రచారం, డైవర్షన్ పాలిటిక్స్ చేయడం సరికాదని సూచించారు. 2023-24 ఏడాదిలో అప్పట్లో టిటిడి గోసంరక్షణ సలహాదారు కోటి శ్రీధర్ చెప్పిన మాటలను చూస్తుంటే , టిటిడి గోశాలలో జరిగిన అవకతవకలపై తమకు తెలిసింది కొంతేనని, ఇంకా చాలా ఉందన్నారు. టిటిడి గోశాల గోవులను ఒంగోలులో అమ్ముకున్నట్లు- తెలుస్తోందన్నారు. గతంలో టిటిడి గోశాల సంచాలకులుగా పనిచేసిన డాక్టర్ హరినాథ్రెడ్డి టిటిడి గోశాలను సొంత ఎస్టేట్ లాగా భావించి భారీ అవకతవకలకు పాల్పడినట్లు- తెలుస్తోందన్నారు. అంతకుముందు గోవులకు అందుతున్న దాణా, తాగునీరు, పరిశుభ్రత, అవసరమైన వైద్యం వంటి వాటి గురించి గోశాల ఇంఛార్జి డైరెక్టర్ శ్రీనివాసులును అడిగి చైర్మన్ తెలుసుకున్నారు. బోర్డు సభ్యులు భానుప్రకాష్రెడ్డి, శాంతా రామ్, నరేష్ కుమార్ పాల్గన్నారు.

# లక్నో అద్భుత విజయం

## అవేశ్‌ఖాన్ అద్భుత ప్రదర్శన

## రాజస్థాన్‌పై ఉత్కంఠ విజయం




జైపూర్: ఐపీఎల్‌లో మరో పోరు అభిమానులను ఊపేసింది. శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ 2 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. ఆఖరి ఓవర్‌లో విజయానికి 9 పరుగులు అవసరమైన దశలో లక్నో పేసర్ అవేశ్‌ఖాన్ అద్భుతం చేశాడు. హెట్‌మైర్(12)ను ఔట్ చేసిన అవేశ్ 6 పరుగులే ఇచ్చుకుని లక్నోకు అదిరిపోయే విజయాన్ని అందించాడు. దీంతో 181 పరుగుల లక్ష్యఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 178/5 కు పరిమితమైంది. యశస్వీ జైస్వాల్ (52 బంతుల్లో 74, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) సూపర్ ఫామ్‌ను కొనసాగించగా కెప్టెన్ రియాన్ పరాగ్ (39) మెరిశాడు. ఈ మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన 14 ఏండ్ల చిన్నోడు వైభవ్ సూర్యవంశీ (20 బంతుల్లో 34, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) ఐపీఎల్‌లో తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో.. నిర్ణీత ఓవర్లలో 180/5 పరుగులు చేసింది. మార్క్‌మ్ (45 బంతుల్లో 66, 5 ఫోర్లు, 3 సిక్సర్లు), అయుశ్ బదోని (34 బంతుల్లో 50, 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

**జైస్వాల్ జోరు**

ఛేదనను రాజస్థాన్ ధాటిగా ఆరంభించింది. జైస్వాల్‌తో పాటు క్రీజులోకి వచ్చిన పాలబుగ్గల పసివాడు వైభవ్.. ఈ లీగ్‌లో తాను ఆడిన మొదటి బంతినే భారీ సిక్సర్ కొట్టాడు. శార్దూల్ వేసిన గుడ్ లెంగ్త్ బంతిని కవర్స్ దిశగా సిక్స్ బాదాడు. అవేశ్ బౌలింగ్‌లోనూ సిక్స్ కొట్టిన వైభవ్.. జైస్వాల్‌తో కలిసి తొలి వికెట్‌కు 8.4 ఓవర్లలో 85 పరుగులు జోడించి ఆ జట్టుకు శుభారంభాన్ని అందించాడు. శార్దూల్ 3వ ఓవర్లో 4 ,6తో బాదుడు మొదలుపెట్టిన జైస్వాల్.. మార్క్‌మ్ ఓవర్లోనూ రెండు సిక్సర్లతో అలరించాడు. మార్క్‌మ్ 9వ ఓవర్లో దురదృష్టవశాత్తూ వైభవ్ స్టంపౌట్‌గా వెనుదిరిగగా రాణా (8) సైతం నిరాశపరిచాడు. కానీ తాత్కాలిక సారథి పరాగ్‌తో జతకలిసిన జైస్వాల్.. లక్నోకు ఎలాంటి అవకాశమివ్వలేదు. 31 బంతుల్లోనే ఈ సీజన్‌లో వరుసగా మూడో హాఫ్ సెంచరీ చేశాడు. ఆఖర్లో అవేశ్.. జైస్వాల్, పరాగ్‌ను ఔట్ చేయడంతో పాటు చివరి ఓవర్‌లోనూ రాయల్స్‌ను కట్టడి చేస్తూ లక్నోకు విజయాన్ని కట్టబెట్టాడు. దీంతో వరుసగా నాలుగో మ్యాచ్‌లో ఓడిన రాయల్స్..ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత క్లిష్టం చేసుకుంది.

**ఆదుకున్న మార్క్మ్,బదోని**

టాపార్డర్ బ్యాటర్లు విఫలమవడంతో లక్నో ఆరంభ ఓవర్లలోనే కష్టాల్లో పడింది. జోరు మీదున్న మిచెల్ మార్ష్ (4)ను మూడో ఓవర్లోనే ఆర్చర్ పెవిలియన్‌కు పంపి రాయల్స్‌కు తొలి బ్రేక్‌నిచ్చాడు. ఆరెంజ్ క్యాప్ వీరుడు నికోలస్ పూరన్ (11)ను సందీప్ శర్మ వికెట్ల ముందు బలిగొనగా కెప్టెన్ పంత్ (3) వైఫల్య ప్రదర్శన దిగ్విజయంగా కొనసాగింది. 54 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దశలో లక్నోను మార్క్మ్,( బదోని ఆదుకున్నారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 76 రన్స్ జోడించారు. 31 బంతుల్లో మార్క్మ్ అర్ధశతకాన్ని పూర్తిచేశాక బ్యాట్ ఝుళిపించాడు. మరో ఎండ్‌లో బదోని కూడా వేగంగా ఆడాడు. అయితే ఈ ఇద్దరూ స్వల్ప వ్యవధిలో నిష్క్రమించినా.. ఆఖర్లో అబ్దుల్ సమద్ (10 బంతుల్లో 30 నాటౌట్, 4 సిక్సర్లు) మెరుపులతో లక్నో పోరాడగలిగే స్కోరును సాధించింది.

**సంక్షిప్త స్కోర్లు:**

లక్నో: 20 ఓవర్లలో 180/5 (మార్క్మ్ 66, బదోని 50, హసరంగ 2/31, తుషార్ 1/26)

రాజస్థాన్: 20 ఓవర్లలో 178/5 (జైస్వాల్ 74, పరాగ్ 39, అవేశ్‌ఖాన్ 3/37, మార్క్మ్1/18)

# ధోనీపై వెటకారంగా స్పందించిన అశ్విన్




2025 ఐపీఎల్ ప్రారంభం నుంచి చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ప్లేయర్ ధోనీ గురించి తెగ చర్చ నడుస్తోంది. ముఖ్యంగా సీఎస్కే మ్యాచ్ ఉంటే చాలు, ఇక కామెంటరీ ప్యానెల్?లో చర్చంతా మహీ గురించే ఉంటుంది. దీనిపై సోషల్ మీడియాలో నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. తాజాగా చెన్నై సీనియర్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా ధోనీ విషయంపై కాస్త వె ట కా ం ం గా స్పందించాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్?లో ప్రస్తుత ఐపీఎల్? గురించి మాట్లాడాడు. ఈ ప్యానెల్??లో అశ్విన్?తోపాటు మరో ఇద్దరు క్రికెట్ ఎక్స్?పర్ట్?లు కూడా ఉన్నారు. ఈ చర్చలో ఒక సమయంలో ధోనీ ప్రస్తావన వచ్చింది. 'అశ్విన్ నువ్వు తమిళనాడు ప్రీమియర్ లీగ్?లో నీ జట్టును అద్భుతంగా నడిపించావు. నువ్వు కెప్టెన్సీ వహించిన జట్టు %ఐచీూా% టైటిల్ నెగ్గింది. అందుకే జట్టుకు కెప్టెన్సీ చాలా ముఖ్యమని నేను నమ్ముతాను. అందుకే కెప్టెన్? అంటే సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్, తలా ధోనీలా ఉండాలి' అని ప్యానెల్?లోని ఓ వ్యక్తి అనగానే, అశ్విన్ వెంటనే కలుగజేసుకున్నాడు.'ష్, ష్' అంటూ ధోనీ గురించి, చెన్నై గురించి మాట్లాడొద్దని సైగలు చేశాడు. దానికి ప్యానలిస్ట్? కూడా స్పందించాడు. 'నువ్వు అలా అనకూడదు. ఇక్కడ నేను ఓ ప్రేక్షకుడిగా మాట్లాడతాను' అని అన్నాడు. ప్రస్తుతం ఇది కాంట్రవర్సీ అయ్యింది. అశ్విన్? ఇలా ప్రవర్తించడం ఏ మాత్రం కరెక్ట్ కాదంటూ ధోనీ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.అయితే ఇటీవల అశ్విన్ ఛానెల్?లో చెన్నై జట్టు గురించి ఓ చర్చ జరిగింది. దీనిపై క్రికెట్ ఎక్స్?పర్ట్? ఒకరు చెన్నై కోచ్ ఫ్లెమింగ్?ను ప్రశ్నించగా, తనకు 'అశ్విన్ యూట్యూబ్ ఛానెల్' గురించి తెలియదు అని రిప్లై ఇచ్చాడు. అసలు అశ్విన్?కు ఓ ఛానెల్ ఉందన్న విషయం తనకు తెలియదని, తాను అలాంటివి ఫాలో అవ్వనని అన్నాడు. దీంతో ఇకపై చెన్నై మ్యాచ్?ల గురించి తన ఛానెల్?లో చర్చించకూడదని అని అశ్విన్ నిర్ణయించుకున్నట్లు తేల్చి చెప్పాశాడు. ఈ కారణంగానే తాజా చర్చలో ధోనీ, చెన్నై ప్రస్తావన రాగానే అశ్విన్ 'వద్దు' అన్నట్లు సైగలు చేశాడు.

# ప్లే ఆఫ్ రేసులో సన్ రైజర్స్ ఆశలు ఆవిరేనా..!

ఐపీఎల్ 18వ సీజన్ 2025లో సన్ రైజర్స్ తొలి మ్యాచ్‌ను ఘనంగా ప్రారంభించి అంచనాలను అమాంతం పెంచింది. ఈ సీజన్లో ఆడిన తొలి మ్యాచ్ లోనే ఐపీఎల్ లో రెండో అత్యధిక స్కోరును నమోదు చేసింది. ఆ తర్వాతి మ్యాచుల్లో మాత్రం అదే జోరును కొనసాగించ లేకపోయింది. ఇప్పటివరకు 7 మ్యాచులు ఆడిన, కేవలం 2 మ్యాచులు మాత్రమే గెలిచింది.

పాయింట్ల పట్టికలోనూ చివరి రెండో స్థానంలో కొనసాగుతోంది. 10 కోట్లు పెట్టి షమీని కొనుగోలు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. 11.75 కోట్లు పెట్టి కొనుగోలు చేసినా ఇషాంత్ కిషన్, తొలి మ్యాచ్ మినహాయిస్తే వరుసగా విఫలమవుతూ వస్తున్నాడు. గత సీజన్లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి, సన్ రైజర్స్ ఫైనల్ దాకా చేరుకుంది. కానీ ఈ సీజన్లో ప్లే ఆఫ్ దశకు చేరకుండానే సీజన్ నుంచి ఇంటిబాట పట్టే అవకాశాలు కనపడుతున్నాయి.సన్ రైజర్స్ టీమ్ లో బ్యాటింగ్ విభాగం బలంగా ఉన్నా..ఈ సీజన్లో ఆశించినంతగా రాణించలేకపోతున్నారు. బౌలింగ్ విషయానికి వస్తే ఈ సీజన్లో పూర్తిగా విఫలమయ్యారు. ఈసారి కప్పు సాధిస్తుందని ఆశించిన సన్ రైజర్స్ ఫ్యాన్స్ కి మాత్రం తీవ్ర నిరాశే మిగులుతోంది.




# ప్రసిద్ధ్ కృష్ణ అదిరే ప్రదర్శన



ఐపీఎల్ 2025లో భాగంగా తాజాగా గుజరాత్ టైటాన్స్ వర్సెస్ దిల్లీ క్యాపిటల్స్ మ్యాచులో ప్రసిద్ధ్ కృష్ణ అదిరే ప్రదర్శన చేశాడు. సాధారణంగా అతడు రన్స్ ఎక్కువ ఇచ్చేస్తాడని అంతా అనుకుంటుంటాం. కానీ ఈ సారి అతడు అద్భుతం చేశాడు. తన అద్భుతమైన పేస్, సీమింగ్ బౌలింగ్ తో కీలక వికెట్లు తీసి.. ప్రత్యర్థి జట్టు దిల్లీ క్యాపిటల్స్ భారీ స్కోర్ చేయకుండా అడ్డుకున్నాడు. 4 ఓవర్లు వేసిన అతడు 10.20 ఎకానమీతో 4 వికెట్లు తీసి కేవలం 41 పరుగులే సమర్పించుకున్నాడు. తద్వారా ఈ సీజన్ లో తన స్పెల్ లో బెస్ట్ బౌలింగ్ ఫిగర్స్ ను నమోదు చేశాడు. ఈ సీజన్ లో పర్పుల్ క్యాప్ హోల్డర్ గానూ అతడే కొనసాగుతుండటం విశేషం. ఈ మ్యాచులో ప్రసిద్ధ్ కృష్ణ .. దిల్లీ స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (28)ను ఔట్ చేయడం బాగా ఆకట్టుకుంది. తన అద్భుతమైన యార్కర్ బంతితో రాహుల్ వికెట్ తీశాడు ప్రసిద్ధ్. దీంతో 4.4 ఓవర్ 58 పరుగులు వద్ద దిల్లీ తన రెండో వికెట్ ను కోల్పోయింది. ఆ తర్వాత సూపర్ ఫామ్ లో ఉన్న కరుణ్ నాయర్ ను షార్ట్ బాల్ వేసి ఊరించి మరీ పెవిలియన్ కు పంపాడు. దీంతో 8.2 ఓవర్ దగ్గర కరుణ్ నాయర్.. అర్షద్ ఖాన్ కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఫలితంగా 93 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది దిల్లీ. అనంతరం మళ్లీ దిల్లీ నాలుగో వికెట్ కోల్పోవడంలో ప్రసిద్ధ్ కృష్ణనే కీలకంగా వ్యవహరించాడు. సిరాజ్ బౌలింగ్ లో స్టబ్స్.. ప్రసిద్ధ్ కృష్ణకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 17 ఓవర్ లో రెండు వికెట్లు పడగొట్టాడు ప్రసిద్ధ్ కృష్ణ.17.1 ఓవర్ దగ్గర అక్షర్ పటేల్ ను పెవిలియన్ పంపాడు ప్రసిద్ధ్. ఆ వెంటనే 17.2 ఓవర్ వద్ద విప్రరాజ్ నిగమ్ ను కూడా ఔట్ చేశాడు. విప్రరాజ్ వికెట్ కీపర్ జోస్ బట్లర్ కు క్యాచ్ ఇచ్చి డకౌట్ గా వెనుదిరిగాడు. మొత్తంగా ఈ ఇన్నింగ్స్ లో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. ఢిల్లీ బ్యాటర్లలో అక్షర్ (39), అశుతోష్ శర్మ (37), కరుణ్ నాయర్ (31), ట్రిస్టన్ స్టబ్స్ (31) రాణించారు. కేఎల్ రాహుల్ (28) ఫర్వాలేదనిపించాడు. అభిషేక్ పోరెల్ (18), విప్రాజ్ నిగమ్ (0), డొనోవన్ ఫెరియెరా (1), స్టార్క్ ( 2 నాటౌట్), కుల్దీప్ (4 నాటౌట్) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 4 వికెట్లు తీయగా.. సిరాజ్, అర్షద్ ఖాన్, ఇషాంత్ శర్మ, సాయికిషోర్ తలో వికెట్ తీశారు.




# బ్యాటింగ్ విభాగం విఫలమైంది

## ఆర్‌సిబి కెప్టెన్ రజత్ పాటిదార్ తీవ్ర అసంతృప్తి

ఆర్‌సిబి కెప్టెన్ రజత్ పాటిదార్ బ్యాటింగ్ విభాగం విఫలమైందని పేర్కొంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. బౌలింగ్ యూనిట్ అద్భుతంగా రాణించినా, బ్యాటర్లు తగిన స్థాయిలో స్పందించకపోవడం వల్ల ఓటమి తప్పలేదని అన్నాడు. బెంగళూరులో వరుసగా మూడో ఓటమిని చవిచూసిన ఆర్‌సిబి ప్లే ఆఫ్స్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. అభిమానులు జట్టు పుంజుకోవాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. మ్యాచ్ ప్రారంభంలో పిచ్ పరిస్థితులు సహజంగా ఆటకు అనుకూలంగా ఉండకపోయినా, బౌలింగ్ యూనిట్ అయితే తమ బాధ్యతను పూర్తిగా నిర్వర్తించిందని అన్నారు. కానీ, బ్యాటింగ్ విభాగం తగిన స్థాయిలో సహకరించకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ప్రారంభంలో తక్కువ పరుగులకు వికెట్లు కోల్పోవడం, భాగస్వామ్యాల లోపం వల్ల స్కోరు వేగంగా పెరగలేదని చెప్పారు. పడిక్కల్ ను పక్కన పెట్టిన నిర్ణయం పిచ్ పరిస్థితులపై ఆధారపడి తీసుకున్నదని తెలిపారు. అయినప్పటికీ, వికెట్ అంతగా చెడూగా లేదని, అది కవర్లలో ఎక్కువసేపు ఉండడం వల్ల ప్రత్యర్థి బౌలర్లకు సహాయపడిందన్నారు. అయినా బౌలర్లు ఎలా బౌలింగ్ చేసినా, బ్యాటర్లు బాధ్యతగా ఆడాల్సిన అవసరం ఉందని పాటిదార్ పేర్కొన్నారు. "బౌలింగ్ యూనిట్ చాలా బాగా రాణించింది. అది పెద్ద సానుకూల అంశం. బ్యాటర్లు కూడా ఉద్దేశ్యంతో ఆడారు, కానీ కొన్ని తప్పులను మేం సరిదిద్దుకోవాల్సి ఉంది," అంటూ తన జట్టు లోపాలపై స్పందించారు. మ్యాచ్‌లో %=జదీ% టీమ్ 42 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి తీవ్రంగా ఒత్తిడిలో పడింది. టిమ్ డేవిడ్ అర్ధ సెంచరీతో (25 బంతుల్లో 50) కొంత మద్ధతు ఇచ్చినా, మొత్తంగా జట్టు కేవలం 95 పరుగులు మాత్రమే చేయగలిగింది. బౌలింగ్ విభాగంలో జోష్ హేజిల్‌వుడ్ 3/14తో అద్భుతంగా రాణించినా, పంజాబ్ కింగ్స్ జట్టు 11 బంతులు మిగిలి ఉండగానే ఐదు వికెట్ల తేడాతో విజయాన్ని సాధించింది. బెంగళూరులో ఇది ఆర్‌సిబికి వరుసగా మూడో ఓటమిగా నమోదవడం, సొంత మైదానంలో పరాజయాల పరంపర కొనసాగడం అభిమానులను నిరాశపరిచింది. రెండు జట్లు మళ్లీ ఏప్రిల్ 20న ముల్లన్‌పూర్‌లో తలపడనున్న నేపథ్యంలో, %=జదీ% తమ తప్పులను సరిదిద్దుకొని పుంజుకోవాలన్న అంచనాలు మొదలయ్యాయి. ఈ ఓటమితో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై విమర్శలు తీవ్రమవుతున్నాయి. ప్లే ఆఫ్స్ అవకాశాలు కాస్త క్లిష్టంగా మారుతున్న వేళ, జట్టు కీలక ఆటగాళ్లు బాధ్యతతో ఆడాల్సిన అవసరం మరింత పెరిగింది. కెప్టెన్ రజత్ పాటిదార్ నాయకత్వం, టిమ్ డేవిడ్ వంటి ఆటగాళ్ల స్పెషల్ ఇన్నింగ్స్‌లు మాత్రమే కాకుండా మిగిలిన బ్యాటర్ల సమిష్టి ప్రదర్శన కూడా కీలకం కానుంది. బౌలింగ్ విభాగం మంచి ప్రదర్శన ఇస్తున్న నేపథ్యంలో, జట్టు విజయాలు సాధించాలంటే బ్యాటింగ్ విభాగం ఆధారంగా నిలవాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. అభిమానులు తమ జట్టు తిరిగి గెలిచే దారిలోకి వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

# అశుతోష్ శర్మతో వాగ్వాదానికి దిగిన ఇషాంత్ శర్మ

ఐపీఎల్ 2025లో 35వ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ క్రికెట్ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతున్న పేసర్ ఇషాంత్ శర్మ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఇషాంత్ తన 3 ఓవర్ల స్పెల్ లో 19 పరుగులిచ్చి డోనోవన్ ఫెరీరా వికెట్ తీసుకున్నాడు. అయితే ఈ మ్యాచ్ సమయంలో ఇషాంత్ శర్మ ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు అశుతోష్ శర్మతో వాగ్వాదానికి దిగాడు.నిజానికి ఇదంతా ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్ లో 19వ ఓవర్ సమయంలో జరిగింది. ఈ ఓవర్‌ను గుజరాత్ టైటాన్స్ పేసర్ ఇషాంత్ శర్మ బౌలింగ్ చేశాడు. అశుతోష్ శర్మ తన ఓవర్ చివరి బంతికి స్ట్రైక్‌లో ఉన్నాడు. ఇషాంత్ అశుతోష్ కు షార్ట్ బాల్ వేశాడు. ఈ బంతి అశుతోష్ భుజానికి తగిలి వికెట్ కీపర్ వద్దకు వెళ్లింది. అయితే ఇషాంత్, గుజరాత్ జట్టు క్యాచ్ ఔట్ కోసం అప్పీల్ చేశారు. కానీ అంపైర్ ఔట్ ఇవ్వలేదు. బంతి తగిలిన తర్వాత అశుతోష్ పరుగు తీశాడు. అంపైర్ లెగ్ బైగా ఒక పరుగు ఇచ్చాడు.అశుతోష్ శర్మ బౌలింగ్ ఎండ్ కు చేరుకున్నప్పుడు అతనికి, ఇషాంత్ శర్మకు మధ్య చిన్న వాదన జరిగింది. ఇద్దరూ ఒకరితో ఒకరు ఏదో మాట్లాడుకుంటూ కనిపించారు. అయితే వారిద్దరూ ఏమి మాట్లాడుకున్నారో తెలియదు. కానీ ఇషాంత్‌కు అశుతోష్‌పై ఏదో కోపం వచ్చినట్లు అనిపించింది. 19వ ఓవర్లో ఇషాంత్ శర్మ కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ఆ ఓవర్ వేసిన తర్వాత ఇషాంత్ శర్మ మైదానం నుంచి బయటకు వెళ్లిపోయాడు.మ్యాచ్ గురించి చెప్పాలంటే, టాస్ ఓడిన తర్వాత మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 8 వికెట్లకు 203 పరుగులు చేసింది. గుజరాత్ కు ఢిల్లీ 204 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.





## బ్లాక్ డ్రెస్‌లో మెరిసిన అందాల పూజా

మూగమూడి అనే తమిళ మూవీతో 2012లో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే. మొదటి సినిమా నిరాశ పరచడంతో తదుపరి ఆఫర్ కోసం దాదాపు రెండేళ్ల సమయం వేచి చూడాల్సి వచ్చింది. 2014లో ఒక లైలా కోసం సినిమాలో నాగ చైతన్య కు జోడీగా నటించింది. ఆ వెంటనే ముకుంద సినిమాలో మెగా హీరో వరుణ్ తేజ్‌కి జోడీగా నటించింది. రెండు సినిమాలు కూడా పెద్దగా కమర్షియల్ గా నిరాశ పరచాయి. అదే సమయంలో బాలీవుడ్‌లో ఈ అమ్మడికి లక్కీగా మొహెంజోదారో సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా కోసం దాదాపు రెండేళ్ల సమయం కేటాయించింది. కానీ ఆ సినిమా నిరాశ పరచడంతో మళ్లీ టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. అల్లు అర్జున్‌కి జోడీగా నటించిన 'డీజే : దువ్వాడ జగన్నాథం' సినిమాతో పూజా హెగ్డే కెరీర్ మారిపోయింది. 2017లో వచ్చిన ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో దాదాపు ఐదు ఆరు సంవత్సరాలు వెనక్కి తిరిగి చూడకుండా వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశం దక్కించుకుంది. కానీ అనూహ్యంగా ఈ మధ్య కాలంలో ఈ అమ్మడికి ఆఫర్లు తగ్గాయి. తెలుగులో సినిమా ఆఫర్లు దక్కడం లేదు. ఆ మధ్య ఖాళీగా ఉన్న పూజా హెగ్డే ఈ మధ్య కాస్త బిజీ అయింది. ప్రస్తుతం ఈమె తమిళ్‌లో రెండు మూడు సినిమాల్లో నటిస్తున్న కారణంగా కోలీవుడ్‌పై ఆశలు పెట్టుకుని ఉంది. కోలీవుడ్ నుంచి రాబోయే మూడు నాలుగు ఏళ్లలో ఈమె నటించే సినిమాలు వరుసగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.



## పెళ్లి ఎప్పుడో చెప్పలేను

*దానిపై అంతగా ఆసక్తి కూడా లేదు.. థగ్‌లైఫ్ ప్రమోషన్‌లో నటి త్రిష కామెంట్స్*

నాలుగు పదుల వయసులోనూ వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి త్రిష. అయితే, ఆమె వైవాహిక బంధంలోకి ఎప్పుడు అడుగు పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆమె పెళ్లి గురించి ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె వివాహంపై తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. తనకు పెళ్లిపై సదుద్దేశం లేదని వ్యాఖ్యలు చేశారు. 'థగ్ లైఫ్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెను.. 'మూడుముళ్ల బంధంపై మీ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించగా.. నిజం చెప్పాలంటే నాకు వివాహంపై నమ్మకం లేదు. నాకు పెళ్లి అయినా ఓకే, కాకపోయినా ఫర్వాలేదని ఆమె బదులిచ్చారు. ఆమె ఇచ్చిన సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ షాకయ్యారు. త్రిష పెళ్లి గురించి కొంతకాలంగా వదంతులు వ్యాప్తి చెందుతోన్న విషయం తెలిసిందే. ఆమె ప్రేమలో ఉన్నారని త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. ఆ వదంతులను ఆమె ఖండించారు. పెళ్లి ఎందుకు చేసుకోలేదు అంటే నా వద్ద సమాధానం లేదు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటానో మాత్రం నాకే తెలియదు. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే కచ్చితంగా చేసుకుంటాను. నన్ను పెళ్లి చేసుకోబోయేవాడు జీవితాంతం నాకు తోడు ఉంటాడనే నమ్మకం కలగాలి. అప్పడే చేసుకుంటాను. పెళ్లి చేసుకొని విడాకులు తీసుకోవడం నాకు ఇష్టం లేదు. పెళ్లి చేసుకొని చాలామంది అసంతృప్తితో జీవిస్తున్నారు. అలాంటి పరిస్థితి నాకు ఎదురుకాకూడదని ఓ సందర్భంలో చెప్పారు. థగ్ లైఫ్' విషయానికి వస్తే.. మణిరత్నం - కమల్ హాసన్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రమే ఇది. సుమారు 38 ఏళ్ల తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తోన్న చిత్రమిది. శింబు, త్రిష కీలక పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ సినిమా నుంచి పెళ్లి సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో చిత్రబృందం పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాన్ ఇండియా స్థాయిలో జూన్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నట్లు- చెప్పారు. ఇందులో పాల్గొన్న త్రిష.. థగ్ లైఫ్'లో అవకాశం వచ్చినందుకు సంతోషంగా భావిస్తున్నా. కమల్‌హాసన్ లాంటి గొప్ప నటుడితో స్క్రీన్ పంచుకోవడం నా అదృష్టం అని తెలిపారు.



## సన్నీలియోన్ స్టన్నింగ్ లుక్ వైరల్

తనదైన అందం, అద్భుత ప్రతిభతో బాలీవుడ్ లో మెరుపులు మెరిపించిన సన్నీలియోన్ ఇటీవలి కాలంలో పూర్తిగా తన సమయాన్ని కుటుంబం, పిల్లలు, వ్యాపారాలకు మాత్రమే అంకితమిస్తోంది. ముఖ్యంగా ఎంటర్ ప్రెన్యూర్ గా రాణించేందుకు తెలివైన వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టిన సన్నీ భారీగా ఆర్జిస్తోంది. కారణం ఏదైనా కానీ, సన్నీ సినిమాలు తగ్గించింది. అప్పుడప్పుడు అడపాదడపా సినిమాలు చేస్తుండటంతో తన ఉనికి అంతగా కనిపించడం లేదు. అయితే సోషల్ మీడియాలో ఇతర స్టార్లకు ధీటుగా అభిమానులకు టచ్ లో ఉంటోంది. తాజాగా సన్నీలియోన్ ప్రఖ్యాత ఫ్యాషన్ మ్యాగజైన్ - కల్చర్డ్ వెడ్డింగ్ కవర్ పేజీపై దర్శనమిచ్చింది. నీలి రంగు డిజైనర్ శారీ ధరించిన సన్నీలియోన్ ఈ ట్రెడిషనల్ లుక్ లో ఎంతో అందంగా కనిపిస్తోంది. హాఫ్ షోల్డర్ గౌనులో సన్నీ గ్లామర్ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. గ్లామర్, గ్రేస్ , తిరుగులేని ఆకర్షణను ఇలా సన్నీ రూపంలో ఆవిష్కరిస్తున్నామని కల్చర్డ్ వెడ్డింగ్ కవర్ పేజీ కర్తలు వెల్లడించారు. అద్భుతమైన ఎనర్జీ, ప్రత్యేక శైలితో సన్నీలియోన్ మరోసారి తానేంటో నిరూపిస్తోంది. సన్నీలియోన్ వ్యక్తిగత కుటుంబ జీవనం విషయానికి వస్తే, సరోగసీలో జన్మించిన బిడ్డతో పాటు పలువురు చిన్నారులను దత్తత తీసుకుని సన్నీలియోన్ పోషిస్తున్న సంగతి తెలిసిందే. తన భర్త డేనియల్ వెబర్ అన్నివిధాలా తనకు సహకారం అందిస్తున్నాడు.



## అనుష్క, ప్రభాస్‌ల జంట ఫోటోలు

**ఏఐతో రూపొందించినట్లు ప్రచారం**

ప్రభాస్- అనుష్క ఈ జంట పలు సినిమాలలో నటించి బెస్ట్ పెయిర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. వారు సినిమాలలోనే కాదు నిజ జీవితంలోను జట్టు కడితే చూడాలని ఎంతో మంది ఫ్యాన్స్ అనుకుంటున్నారు. కొన్నాళుల్లగా వారిద్దరి రిలేషన్ గురించి నెట్టింట అనేక వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. వారిద్దరు ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి పీటలు కూడా ఎక్కబోతున్నారని ప్రచారం జరిగింది. అంతేకాదు ఇటీవలే ఏఐతో వీరిద్దరి పెళ్లి ఫొటోలను క్రియేట్ చేయడంతోపాటు- వారికి పిల్లలు కూడా ఉన్నట్లు సృష్టించారు. ఇలా ప్రభాస్ అనుష్కలకి సంబంధించి నెట్టింట ఏదో ఒక ప్రచారం నడుస్తూనే ఉంటుంది. అయితే తాజాగా ప్రభాస్, అనుష్క క్లోజ్ ఫొటోలని తెగ వైరల్ చేస్తున్నారు. ఇందులో ప్రభాస్ , అనుష్క హగ్ చేసుకున్నట్టుగా ఉంది. ఏఐ సాయంతో ఈ ఫొటోలని రూపొందించినట్టు చెబుతున్నారు. ఇది చూసిన నెటిజన్స్.. ఎందుకు రా ఇలా తయారయ్యారు. ఫేక్ ఫొటోలని క్రియేట్ చేసినందుకు అభిమానులు మండిపడుతున్నారు. ఏది ఏమైన ఈ పిక్స్ మాత్రం సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఇక ఇప్పటికే ఎన్నోసార్లు డార్లింగ్ పెళ్లి గురించిన చర్చ సోషల్ మీడియాలో వైరలయ్యింది. గత పదేళ్లుగా ప్రభాస్ పెళ్లి గురించి ఏదోక వార్త వస్తూనే ఉంది. ప్రభాస్, అనుష్క జోడి తెలుగు చిత్రపరిశ్రమలో సూపర్ హిట్. వీరిద్దరు కలిసి మిర్చి, బాహుబలి చిత్రాలలో నటించి మంచి పేరు ప్రఖ్యాతలు అందుకున్నారు. త్వరలో ప్రభాస్ స్పిరిట్ అనే చిత్రం చేయనున్నాడు. ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో తెరకెక్కనుంది. ఇందులో కూడా అనుష్కని హీరోయిన్‌గా తీసుకున్నట్టు టాక్ నడుస్తుంది. ఇటీవల అనుష్క సోలో హీరోయిన్‌గా సినిమాలు చేస్తుంది. ఇప్పుడు ప్రభాస్‌తో జత కట్టేందుకు సిద్ధమైనట్టు- తెలుస్తుంది.

## ఓటిటిలోకి రానున్న మ్యాడ్‌స్క్వేర్



ఇటీవల విడుదలైన యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ మూవీ 'మ్యాడ్ స్క్వేర్' ఎలాంటి విజయం అందుకుందో చెప్పక్కర్లేదు. ఉగాది కానుకగా మార్చి 28న గ్రాండ్‌గా వరల్డ్ వైడ్ రిలీజైన ఈ మూవీ కామెడీ, లవ్, ఫ్రెండ్షిప్ అంశాలతో యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంది. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్..లు హీరోలుగా నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు వసూలు చేసింది. 'మ్యాడ్' మూవీకి కొనసాగింపుగా రూపొందడంతో 'మ్యాడ్ స్క్వేర్' మూవీ పై మొదటి నుండి తెలుగు ప్రేక్షకుల మంచి అంచనాలు పెట్టుకున్నారు. ఆ అంచనాలకు తగినట్లుగా ముగ్గురు హీరోలు తమ టాలెంట్ తో మంచి టాక్ తెచ్చుకున్నారు. ముఖ్యంగా లడ్డు యాక్టింగ్, కామెడీ టైమింగ్ బాగా ఆకట్టుకుంది. ఎన్టీఆర్ సక్సెస్ మీట్‌కి రావడం కూడా ఈ మూవీకి కొంత హెల్ప్ అయింది. ఇక ఈ చిత్రం థియేటర్స్‌లో రన్‌ని దాదాపు కంప్లీట్ చేసుకోవచ్చింది. దీంతో తాజాగా ఈ మూవీ ఓటీటీ రిలీజ్‌కి రెడీ అవుతున్నట్టుగా తెలుస్తోంది. అయితే ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్నది. ఈ చిత్రం ఈ ఏప్రిల్ 25 నుంచి అలరించేందుకు వచ్చేస్తుంది అని తెలుస్తుంది. అయితే పాన్ ఇండియా భాషల్లో కాకుండా కేవలం తెలుగులోనే ఈ చిత్రం రానున్నట్టు టాక్.

## మద్యం మత్తులో కారు డ్రైవ్

**బాబీ సింహా డ్రైవర్ అరెస్ట్**

జాతీయ అవార్డు గ్రహీత, తమిళ నటు-డు బాబీ సింహా కారు బీభత్సం సృష్టించింది. బాబీ సింహా డ్రైవర్ మద్యం సేవించి అతి వేగంతో కారు నడపడంతో నియంత్రణ తప్పి వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా.. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. మద్యం సేవించి కారు నడపడంతో పాటు- అతివేగంగా డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారణమైనందుకు డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ప్రమాదం ఎక్కడుతంగల్ నుంచి చెన్నై ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తుండగా జరిగింది. ఈ సమయంలో బాబీ సింహా కారులో లేరు. చెన్నై ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవర్ పుష్పరాజ్ మద్యం మత్తులో ఉండి.. అతివేగం కారణంగా కారు నియంత్రణ కోల్పోయి మూడు మోటార్‌సైకిళ్లు, రెండు ఆటోరిక్షాలు, ఒక కారును ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో మోటార్ సైకిళ్లపై ఉన్న నలుగురు గాయపడ్డారని.. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com